News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK చంద్రకాంత్ NEWS
తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 02 | సంచిక :229 | ఖమ్మం | శుక్రవారం, అక్టోబర్ 4, 2024 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

# ముసుగు రాజకీయాలొద్దు

పదేళ్ల పాటు అధికారంలో ఉన్న భారాస నాయకులు చెరువులు, నాలాలను ఆక్రమించి విధ్వంసం సృష్టించారు. హైదరాబాద్ నగర ప్రజలకు తాగునీటిని అందిస్తున్న జంటజలాశయాను ఆక్రమించుకుని ఫాంహౌస్‌లు కట్టుకున్నారు. జన్వాడలో కేటీఆర్, అజీజ్‌నగర్‌లో హరీశ్‌రావు, జంట జలాశయాలకు సమీపంలో సబితమ్మ తన కుమారుల పేర్లతో ఫాంహౌస్‌లు నిర్మించుకున్నారు. వాటిని కూల్చేస్తే అక్రమం అవుతుందా?" -సీఎం రేవంత్‌రెడ్డి



- కేటీఆర్, హరీశ్.. మూసీని అడ్డుపెట్టుకుని ఎన్నాళ్లు గడుపుతారు?
- ఫాంహౌస్‌లను కాపాడుకునేందుకే భారాస ఆందోళనలు
- ఆ పార్టీకి రూ.1500 కోట్లున్నాయి.. రూ.500 కోట్లు పేదలకు ఇవ్వొచ్చుగా..
- ఈటలా.. ప్రధాని వద్దకు వెళ్లి రూ.25 వేల కోట్లు అడుగుదాం పదండి
- 'ఫ్యామిలీ డిజిటల్ కార్డు' పైలట్ ప్రాజెక్టు ప్రారంభం సందర్భంగా సీఎం రేవంత్

'దోమలు, అనారోగ్యం, వరదల వంటి ఇబ్బందుల మధ్య.. మూసీలో నివసిస్తున్న ప్రజలు గౌరవంగా జీవించేందుకు రెండు పడక గదుల ఇళ్లు, తొవ్వ ఖర్చులకు రూ.పాతిక వేలు ఇస్తున్నాం. దీనిపై మూసీ ముసుగు కప్పుకొని రాజకీయాలు చేయకండి. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను ఆక్రమించి నిర్మించుకున్న తమ ఫాంహౌస్‌లను కాపాడుకునేందుకే బావాబావమరుదులు హరీశ్‌రావు, కేటీఆర్‌లు కిరాయిమూకలతో ఆందోళనలు చేయిస్తున్నారు. వారికి సబితమ్మ వంత పాడుతోంది. వెనకున్న కేవీపీ కూడా ఆమెను రక్షించలేరు' అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిప్పులు చెరిగారు. సికింద్రాబాద్ హాకీ గ్రౌండ్స్‌లో గురువారం 'ఫ్యామిలీ డిజిటల్ కార్డు' పైలట్ ప్రాజెక్టు సర్వేను ప్రారంభించిన సందర్భంగా.. ఆయన విపక్షాల తీరుపై మండిపడ్డారు. 'బావాబావమరుదులు మూసీని అడ్డుపెట్టుకుని ఎన్ని రోజులు గడుపుతారు? మీ భరతం పడతాం.. పేద ప్రజలపై అంత ప్రేమ ఉంటే.. భారాస ఖాతాలో రూ.1500 కోట్లు ఉన్నాయి.. రూ.500 కోట్లు పేదలకు ఇవ్వొచ్చు కదా. మూసీ నిర్వాసితులకు ఇంకా మేలైన పథకం ఉంటే సూచించండి. సచివాలయానికి రండి.. ఎన్ని రోజులైనా కూర్చుని చర్చిద్దాం. పేదలకు కొంత బాధ, నష్టం కలుగుతున్న మాట వాస్తవం. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకునే మూసీ ప్రక్షాళన చేపట్టాం. అడ్డుకోవద్దు' అని రేవంత్‌రెడ్డి అన్నారు.

**ఏ ఆక్రమణనూ వదిలిపెట్టం**

హైదరాబాద్‌లో చెరువులు, కుంటలు, నాలాల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఎవరు ఇళ్లు కట్టుకున్నా కూల్చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 'చెరువులను పరిరక్షించాల్సిన భారాస నాయకులు వెంచర్లు వేశారు. మూసీ బఫర్‌జోన్‌లో, నల్లచెరువులో ప్లాట్లు వేసి అమ్మింది మీరు కాదా? మూసీలో కాలుష్యంతో నల్గొండ జిల్లాలో

వివరాలు 2లో..

## సన్నవడ్ల కొనుగోలుకు ప్రత్యేక కేంద్రాలు



- సన్నరకాలకు రూ. 500 బోనస్ ఇవ్వాలె
- రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 7 వేల సెంటర్లు
- అవసరమైతే కొత్తగా ఐకేపీ సెంటర్లు
- గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉంచండి
- తాలు, తేమ పేరుతో మోసం చేస్తే క్రిమినల్ కేసులు పెట్టాలి
- రాష్ట్రంలో 100% సన్నవడ్లు పండిచేలా చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి

సన్నవడ్ల కొనుగోలుకు ప్రత్యేకంగా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ ఏడాది నుంచి సన్న రకాలకు రూ. 500 బోనస్ ఇవ్వాలని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లకు మొత్తం ఏడు వేల ఐకేపీ కేంద్రాలను

వివరాలు 2లో..

## వైజాగ్ స్టీల్ అమ్మేస్తున్నామనడం సత్యదూరం



ఎన్డీయే ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ప్లాం ట్‌ను అమ్మేస్తోందన్న ఆరోపణలు నిరా ధారం, సత్యదూరమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమా రస్వామి గురువారం ఎక్స్‌లో పేర్కొన్నా రు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణలో

వివరాలు 2లో..

## రీవారి బ్రహ్మోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

- రోజూ 24,000 ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ చేస్తాం
- తితిదే ఈవో జె.శ్యామలరావు



శ్రీవారి బ్రహ్మోత్సవాలను గతంకన్నా మిన్నగా.. వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తితిదే ఈవో జె.శ్యామలరావు తెలిపారు.

వివరాలు 2లో..

## రాష్ట్ర ఆదాయం పడిపోతోంది... పరిపాలనా వైఫల్యానికి నిదర్శనం



- పత్రికలో వచ్చిన కథనాన్ని ట్వీట్‌కు జత చేసిన కేటీఆర్
- అనుభవరాహిత్యం వల్లే ప్రభుత్వ ఆదాయం పడిపోతోందన్న కేటీఆర్
- సంపదను సృష్టించి పేదలకు పంచే తెలివి సీఎంకు లేకపోవడమే సమస్య అని వ్యాఖ్య
- మార్పు మార్పు అంటూ కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శ

వివరాలు 2లో..

## పంచాయితీ ఎన్నికలు: ఓటర్ల తుది జాబితా విడుదల చేసిన ఈసీ..


- పంచాయతీల్లో 1,67,33,584 ఓటర్లు
- తుది జాబితా విడుదల చేసిన ఈసీ
- 12,867 పంచాయతీల్లో 1,13,722 వార్డులు
- 82,04,518 పురుషులు, 85,28,573 మహిళలు, 493 ఇతరులు
- స్థానిక పోరుకు ఎన్నికల కమిషన్ సంసిద్ధత

వివరాలు 2లో..



## తిరుమల లడ్డూ వివాదంపై నేడు సుప్రీంకోర్టులో విచారణ

- శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగం
- సుప్రీంకోర్టును ఆశ్రయించిన వైవీ సుబ్బారెడ్డి, తదితరులు
- సుప్రీం పర్యవేక్షణలో విచారణ జరగాలన్న బీజేపీ నేత సుబ్రహ్మణ్యస్వామి
- ముఖ్యమైన కేసు విచారణ ఉందన్న సొలిసిటర్ జనరల్
- లడ్డూ కేసును రేపు విచారించాలని సుప్రీంకు విన్నపం
- సొలిసిటర్ జనరల్ విజ్ఞప్తిని మన్నించిన అత్యున్నత న్యాయస్థానం



వివరాలు 2లో..

## గంజాయి, డ్రగ్స్ కట్టడికి రాష్ట్రస్థాయిలో టాస్క్‌ఫోర్స్

- జిల్లాకొకటి చొప్పున 26 నార్కొటిక్స్ కంట్రోల్ సెల్స్
- విశాఖపట్నం, పాడేరుల్లో స్టేట్ టాస్క్‌ఫోర్స్ విభాగాలు
- ఐదు చోట్ల ప్రత్యేక న్యాయస్థానాలు
- మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో కీలక నిర్ణయాలు
- 10న జరిగే కేబినెట్ భేటీలో ప్రతిపాదనలు పెట్టాలని తీర్మానం



వివరాలు 2లో..

## ఎస్సీ వర్గీకరణ విషయంలో రేవంత్ రెడ్డి జాప్యం చేస్తున్నారు



- సుప్రీంకోర్టు తీర్పును సీఎం స్వాగతించారన్న మంద కృష్ణ
- తీర్పును అమలు చేయడంలో ఎందుకు శ్రద్ధ చూపడం లేదో అర్థం కావడం లేదని వ్యాఖ్య
- ఎస్సీ వర్గీకరణ చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని సుప్రీంకోర్టు చెప్పిందన్న మంద కృష్ణ

ఎస్సీ వర్గీకరణ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాప్యం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. అందరికంటే ముందే సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన ముఖ్యమంత్రి... అమలు చేయడంలో

వివరాలు 2లో..

## అన్నీ తెలిసే నెయ్యి కాంట్రాక్టు ఇచ్చారు... ఇవిగో ఆధారాలు!

- వెంకటేశ్వరస్వామి లడ్డూ వివాదం
- ఏఆర్ ఫుడ్స్ సరఫరా చేసిన నెయ్యి మొత్తం కల్తీనే అంటూ పట్టాభి ఆరోపణలు
- ఆ సంస్థకు రూ.31.98 కోట్ల కాంట్రాక్టు ఇచ్చారని వెల్లడి
- కల్తీ నెయ్యి వెనుక ఎవరి హస్తం ఉందో నిగ్గు తేల్చేందుకు సిట్ వేశామని స్పష్టీకరణ

వివరాలు 2లో..



కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి సంపదను దోచుకునేందుకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం టీటీడీని జంతువుల కొవ్వుతో కలిసిన కల్తీ నెయ్యితో అపవిత్రం చేసిందని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా చేసిందని తెలుగుదేశంపార్టీ జాతీయ అధి కార ప్రతినిధి

## పేదల ఇళ్లు కూల్చితే ఊరుకోం..



గతంలో కేసీఆర్‌మూసీ బ్యూటీఫికేషన్‌అంటూ మార్కింగ్‌చేసి పదేళ్ల కిందట ప్లాన్‌స్టార్ట్‌చేశాడని, ప్రజల నుంచి వ్యతిరేకత రాగానే వెనక్కి తగ్గడని, దాన్నే ఇప్పుడు రేవంత్ తలకెత్తుకున్నాడని కేంద్ర మంత్రి, బీజేపీ స్టేట్ ఛీఫ్ కిషన్‌రెడ్డి ఆరోపించా రు. బీజేపీ స్టేట్ ఆఫీస్‌లో ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఏకపక్షంగా సీఎం రేవంత్‌రెడ్డి పేదల ఇళ్లు కూల్చడం ఏ మాత్రం న్యాయం కాదన్నారు.

వివరాలు 2లో..

# గంజాయి, డ్రగ్స్ కట్టడికి రాష్ట్రస్థాయిలో టాస్క్‌ఫోర్స్

ఆంధ్రప్రదేశ్‌లో గంజాయి, మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు వీలుగా రాష్ట్రస్థాయిలో యాంటీ నార్కొటిక్ టాస్క్‌ఫోర్స్ (ఏఎన్‌టీఎఫ్), జిల్లాకొకటి చొప్పున మొత్తం 26 నార్కొటిక్స్ కంట్రోల్ సెల్స్ ఏర్పాటుకు మంత్రివర్గం ఉపసంఘం ఆమోదం తెలిపింది. డీజీపీ పర్యవేక్షణలో ఐజీ స్థాయి అధికారి అధిపతిగా ఏఎన్‌టీఎఫ్ ఏర్పాటుచేయాలని తీర్మానించింది. ఏఎన్‌టీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోలీసు స్టేషన్, నాలుగు బృందాలతో కూడిన స్టేట్ టాస్క్‌ఫోర్స్ వింగ్ నెలకొల్పాలని అనుకుంది. వీటిలో ఒక బృందాన్ని పాడేరులో, మరో బృందాన్ని విశాఖపట్నంలో ఏర్పాటుచేయాలని ప్రతిపాదించింది. సచివాలయంలో హెూంమంత్రి వంగలపూడి అనిత, మంత్రులు నారా లోకేశ్, కొల్లు రవీంద్ర, గుమ్మిడి సంధ్యారాణి, సత్యకుమార్ యాదవ్‌లతో కూడిన మంత్రివర్గ ఉపసంఘం గురువారం సమావేశమైంది. రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల సమస్యపై చర్చించింది. వైకాపా హయాంలో గంజాయి, డ్రగ్స్ తీవ్రత ఎంత పెరిగింది, ఏఎన్‌టీఎఫ్ స్వరూపం ఎలా ఉండాలనేదానిపై డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఐజీ రవికృష్ణ ప్రజంటేషన్ రూపంలో ఉపసంఘానికి వివరించారు. వాటి స్మగ్లింగ్, అక్రమ రవాణా, సరఫరా, సాగు, వినియోగం, కింగ్‌పిన్‌లను పట్టుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. 459 పోస్టులతో ఏఎన్‌టీఎఫ్ ఏర్పాటు ప్రతిపాదనల్ని ఈ నెల 10న జరగబోయే మంత్రివర్గ సమావేశంలో పెట్టాలని తీర్మానించింది.

**డేటా విశ్లేషణ, సైబర్ నిఘాతో డ్రగ్స్ ఆటకట్టు**

సామాజిక మాధ్యమాల పర్యవేక్షణ, అనుమానాస్పద లావాదేవీల గుర్తింపు, ఆన్‌లైన్‌లో జరిగే మాదకద్రవ్యాల విక్రయాలను గుర్తించి అడ్డుకోవటం, డార్క్‌వెబ్‌పై నిఘా వంటివాటితో మాదకద్రవ్యాలు, గంజాయిని నిర్మూలించాలని ఉపసంఘం తీర్మానించింది.

స్మగ్లర్లు, కొరియర్ల నుంచి స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, ఇతర పరికరాలను డిజిటల్ ఫోరెన్సిక్ ద్వారా విశ్లేషించి కింగ్‌పిన్‌లను పట్టుకోవాలని సూచించింది.

మారుమూల ప్రాంతాల్లో సాగయ్యే గంజాయిని డ్రోన్లు, శాటిలైట్ చిత్రాల ద్వారా గుర్తించి ధ్వంసం చేయాలి.

రాష్ట్ర సరిహద్దులు, గంజాయి అక్రమ రవాణా సాగే మార్గాల్లో ఏఐ ఆధారిత సీసీ కెమెరాలు, ఫేషియల్ రికగ్నేషన్, ఆటోమేటెడ్ నంబర్‌ప్లేట్ రికగ్నేషన్ వంటివి పెట్టాలి.

మాదకద్రవ్యాలు, గంజాయి కేసుల విచారణ సత్వరం పూర్తయ్యేలా, దోషులకు శిక్షపడేలా చేసేందుకు విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, తిరుపతిల్లో ప్రత్యేక కోర్టులు ఏర్పాటుచేయాలి.

**దుష్పరిణామాలపై ప్రచారం చేయాలి: మంత్రి లోకేశ్**

'డ్రగ్స్, గంజాయి దుష్పరిణామాలపై ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలి. రాష్ట్రంలో గంజాయి సాగును అరికట్టడంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి ఏపీకి రాకుండా ఆయా ప్రభుత్వాలతో సమన్వయం చేసుకోవాలి. విజిబుల్ పోలీసింగ్‌తో పాటు ఇన్‌విజిబుల్ పోలీసింగ్‌పైనా దృష్టిసారించాలి. గంజాయి, డ్రగ్స్‌పై పోరాటంలో సెలబ్రిటీలను భాగస్వాములను చేస్తాం' అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

'వైకాపా ప్రభుత్వ హయాంలో గంజాయి, మాదకద్రవ్యాలు, మద్యానికి బానిసలై ఆత్మహత్యలకు పాల్పడ్డవారి సంఖ్య విపరీతంగా పెరిగింది. సైబర్‌నిఘా ద్వారా మాదకద్రవ్యాల ముఠాల మూలాల్ని పెకలిస్తాం. గంజాయి స్మగ్లింగ్, రవాణా సమాచారం చెప్పినవారికి రివార్డులు అందజేస్తాం' అని హెూంమంత్రి అనిత తెలిపారు.

**గంజాయి, డ్రగ్స్‌పై ఫిర్యాదుల స్వీకరణకు టోల్‌ఫ్రీ నంబర్ 1908**

మాదకద్రవ్యాలు, గంజాయిపై సమాచారం, ఫిర్యాదుల స్వీకరణ కోసం 1908 టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటుచేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. దీంతోపాటు ఒక ఫోన్‌నంబర్, మెయిల్ ఐడీ, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, థ్రెడ్స్ ఐడీలు కూడా సిద్ధం చేసి వాటిని విస్తృతంగా ప్రజల్లో ప్రచారం చేయాలని తీర్మానించారు.

# ముసుగు రాజకీయాలొద్దు

- మొదటి పేజీ తరువాయి

పంటలు, కూరగాయలు విషపూరితమయ్యాయి. ఆ జిల్లా ప్రజలు ఒకవైపు ఫ్లోరైడ్‌తో బాధపడుతున్నారు. మరోవైపు విషం మింగుతూ బతుకుతున్నారు. వారు స్వచ్ఛమైన నీరు తాగేందుకు అర్హులు కాదా? ఆక్రమణల వల్ల ఇప్పటికే హైదరాబాద్ చుట్టుపక్కల భూగర్భజలాలు అడుగంటాయి. అందుకే జంట జలాశయాలు, మూసీ ప్రక్షాళన చేపట్టాం. ఈ లోపు నగరంలోని ప్రజలందరూ ఇళ్లలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచిస్తున్నాం. అవి లేని ఇళ్లకు నీళ్ల ట్యాంకర్ రెట్టింపు ధరకు విక్రయించాలని అధికారులను ఆదేశించాం.

**బుల్డోజర్లు కొనేందుకు మా వద్ద డబ్బుల్లేవ్..**

మూసీ నిర్వాసితుల వద్దకు హరీశ్‌రావు, కేటీఆర్, ఈటల తదితర నాయకులు వెళ్లి కృత్రిమ ధర్నాలు చేస్తున్నారు. ముందు మాపై నుంచి బుల్డోజర్లు పంపించండంటున్నారు. అన్ని బుల్డోజర్లు కొనేందుకు మా దగ్గర డబ్బుల్లేవు. ప్రజలకు నచ్చజెప్పి.. మెరుగైన పరిహారం అందిస్తాం. రాజకీయంగా నష్టమని తెలిసినా ముందుకు వెళ్తున్నామంటే.. హైదరాబాద్ ప్రజల భవిష్యత్తు కోసం మాత్రమే. కేటీఆర్, హరీశ్‌లకు జిరాక్స్‌లా ఈటల రాజేందర్ మాట్లాడుతున్నారు. ఈటలా.. మీకు నిజంగా పేదలపై ప్రేమ ఉంటే కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లతో కలిసి రండి. మీరు ముగ్గురూ ముందుండి దిల్లీకి నడిపించండి. మేం వెనకే ఉంటాం. జవహర్ నగర్‌లో వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. నిర్వాసితులకు 150 గజాల చొప్పున ఇద్దాం. ఇళ్లు కట్టేందుకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రూ.25 వేల కోట్లు అడుగుదాం పదండి. మోదీని అడిగేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవు.

**ఫ్యామిలీ డిజిటల్ కార్డుతోనే అన్నీ..**

ఒకే రాష్ట్రం, ఒకే కార్డు అన్న నినాదంతో ఫ్యామిలీ డిజిటల్ కార్డును రూపొందిస్తున్నాం. రేషన్, ఆరోగ్యశ్రీ, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, పింఛను, ఫీజు రీయింబర్స్‌మెంట్.. ఇలా అన్నిటికీ ఈ కార్డు ఉపయోగపడుతుంది. వారసత్వ హక్కులు, ఆస్తుల బదిలీలు, విరాసత్‌లు, పాస్‌పోర్టు దరఖాస్తులు ఇలా అన్నీ సులభంగా పరిష్కారమవుతాయి. రాష్ట్రంలోని 238 యూనిట్ల పరిధుల్లో ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకూ ఐదు రోజుల పాటు పైలట్ ప్రాజెక్టు సర్వే నిర్వహిస్తారు' అని సీఎం వివరించారు. రెవెన్యూ, గృహనిర్మాణశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మూసీ నిర్వాసితులకు ప్రస్తుతం కేటాయించిన 15 వేల ఇళ్లకు అదనంగా మరో నాలుగైదు వేల ఇళ్లు నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. నిర్వాసితుల విషయంలో సోషల్‌మీడియా, య్యూటూబ్ ఛానెళ్లలో కేటీఆర్ విష ప్రచారం చేయిస్తున్నారని, దీన్ని ఇప్పటికే ప్రజలు గ్రహించారని అన్నారు. పేదలకు 1.33 లక్షల రెండు పడక గదుల ఇళ్లు ఇస్తామన్న భారాస ప్రభుత్వం.. 67 వేల ఇళ్లు మాత్రమే నిర్మించిందని, మిగిలిన ఇళ్లను పూర్తిచేసి దసరాలోపు లబ్ధిదారులకు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ మాట్లాడుతూ.. తమ నియోజకవర్గానికి ఒక డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ నియోజకవర్గంలోని వాహెబ్‌నగర్‌లో 900 కుటుంబాలు, కారా నాలోని 600 కుటుంబాలను సర్వేకు అధికారులు ఎంపిక చేయగా.. వారిలో ఐదుగురిని సీఎం రేవంత్‌రెడ్డి వేదికపైకి పిలిచారు. ఎమ్మెల్యే శ్రీగణేశ్ భార్య వర్షశ్రీతోపాటు స్థానిక మహిళలు శారద, రాజేశ్వరి, సుల్తానా బేగం, బొబ్బిలి అన్నపూర్ణమ్మలకు ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఫారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మేయర్, డిప్యూటీ మేయర్లు గద్వాల్ విజయలక్ష్మి, మోతె శ్రీలతారెడ్డి, మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలాచారి, ఐఏఎస్ అధికారులు జయేశ్‌రంజన్, దాసరి హరిచందన, అనురాగ్ జయంతి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఎమ్మెల్సీలు మీర్జా రియాజ్ ఉల్ హసన్, మీర్జా రహమత్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

- మొదటి పేజీ తరువాయి

స్థానిక అన్నమయ్య భవనంలో అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. శుక్రవారం నుంచి ఈనెల 12 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని తెలిపారు. శుక్రవారం(4వ తేదీన) ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పిస్తారని, అనంతరం తితిదే 2025 క్యాలెండర్లు, డైరీలను ఆవిష్కరిస్తారని చెప్పారు. ఈ నెల 5వ తేదీ నుంచి తిరుపతి, తిరుమలలోని తితిదే విక్రయ కేంద్రాల్లో వాటిని అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా 1.32 లక్షల మందికి రూ.300 దర్శన టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచామని, రోజూ ఎస్ఎస్‌డీ టోకెన్లు 24,000 కేటాయించనున్నట్లు ఆయన వివరించారు. శ్రీవాణి దర్శన టికెట్ల కరెంట్ బుకింగ్ ఈనెల 4, 8వ తేదీన రద్దు చేశామని, మిగిలిన రోజుల్లో అందుబాటులో ఉంటాయన్నారు. తిరుమ లలో 40 వేల మంది భక్తులు బసచేసే అవకాశం ఉందని, యాత్రికుల సౌకర్యాల సముదాయా(పీఏసీ)లు 1, 2, 3, 4తో కలిపి 28 హాళ్లు, 670 వరకు లాకర్లు ఉన్నాయని మరో 20 వేల మంది భక్తులు వీటిలో బస చేయవచ్చన్నారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో ఉదయం 8 నుంచి రాత్రి ఒంటిగంట వరకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు పంపిణీ చేస్తామని, రోజూ లక్ష మందికి పాలు అందిస్తామన్నారు. అలిపిరి, శ్రీవారి మెట్టు మార్గాల వద్ద స్విమ్స్ వైద్యులతో కార్డియాక్ స్క్రీనింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గరుడసేవ రోజున 24 గంటలూ ఘాట్‌రోడ్లను తెరిచి ఉంచుతున్నట్లు చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో మూడువేల ట్రిప్పుల ద్వారా మూడు లక్షల మందిని తిరు మలకు తరలిస్తామన్నారు. శ్రీవారి చక్రస్నానం రోజున భక్తుల భద్రత కోసం గజ ఈతగాళ్లతోపాటు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, బో ట్లను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకున్నట్లు ఈవో వివరించారు.

## ఎస్సీ వర్గీకరణ విషయంలో రేవంత్ రెడ్డి జాప్యం చేస్తున్నారు

- మొదటి పేజీ తరువాయి

మాత్రం ఎందుకు శ్రద్ధ చూపించడం లేదో అర్థం కావడం లేదన్నారు. సుప్రీంకోర్టు ఆగస్ట్ 1న ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పునకు విరుద్ధంగా ముఖ్యమంత్రి వ్యవరిస్తున్నారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని సుప్రీం కోర్టు చెప్పిందని గుర్తు చేశారు. ఆ తీర్పు వెలువడిన వెంటనే సీఎం రేవంత్ రెడ్డి స్పందించారన్నారు. ముఖ్యమంత్రి ఇటీవల డీఎస్సీ ఫలితాలు విడుదల చేశారని, 9వ తేదీన నియామక పత్రాలు ఇస్తామని చెబుతున్నారని పేర్కొన్నారు. వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత డీఎస్సీ పరీక్షలు జరిగాయని, వాటి విషయంలో వేగం ప్రదర్శించిన రేవంత్ రెడ్డి వర్గీకరణ విషయంలో మాత్రం ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని నిలదీశారు. చట్టసభలో ఇచ్చిన మాటకు విరుద్ధంగా ముందుకు సాగుతున్నారని ఆరోపించారు.సుప్రీంకోర్టు తీర్పు తర్వాత పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలు ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో కమిటీ వేసి అనంతరం అమలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పటి వరకు ఈ విషయంపై ఎందుకు నిర్ణయం తీసుకోవడం లేదని నిలదీశారు. అధిష్ఠానం ఒత్తిడి ఒకవైపు , ఇంకోవైపు రాష్ట్రంలో మాలల ఒత్తిడి వల్ల వర్గీకరణ అమలుకు వెనుకాడుతున్నారని ఆరోపించారు. జాప్యాన్ని నిరసిస్తూ ఈ నెల 9న అన్ని జిల్లాల్లో నల్ల జెండాలతో నిరసన తెలుపుతామన్నారు.

## అన్నీ తెలిసే నెయ్యి కాంట్రాక్టు ఇచ్చారు... ఇవిగో ఆధారాలు!

- మొదటి పేజీ తరువాయి

కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మండిపడ్డారు. మంగళగిరిలోని తెలుగుదేశంపార్టీ కేంద్ర కార్యాలయంలో ఇవాళ విలేకరుల సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం టీటీడీకి కల్తీ నెయ్యిని సరఫరా చేసిందని ఆరోపిస్తూ, పలు కీలక డాక్యుమెంట్లను మీడియా ముందు పట్టాభిరామ్ ఉంచారు.

**ఇది క్షమించరాని పాపం!**

తిరుమల తిరుపతి దేవస్థానంలో గత ప్రభుత్వం క్షమించరాని పాపం చేసింది. అన్నీ తెలిసే వైసీపీ ఏఆర్ డెయిరీని అడ్డుపెట్టుకుని స్వామివారి ప్రసాదం లడ్డూ తయారీలో కలుషితమైన నెయ్యిని వాడారు. జంతువుల కొవ్వుతో కలిసిన నెయ్యిని వైసీపీ పాలకులు వాడి క్షమించరాని పాపం చేశారు.మరిన్ని ఆధారాలు నేడు ప్రజల ముందు ఉంచుతున్నాం. 10 లక్షల కిలోల స్వచ్ఛమైన ఆవు నెయ్యి సరఫరా కాంట్రాక్టు ఏఆర్ ఫుడ్స్ కంపెనీకి వైసీపీ ప్రభుత్వం ఇచ్చింది. ఈ కాంట్రాక్టు విలువ రూ.31.98 కోట్లు.

**ఒక్కరోజు ముందు అగ్రిమెంట్ చేసుకున్నారు**

మే 15 2024న వైసీపీ ప్రభుత్వం ఏఆర్ ఫుడ్స్ డెయిరీకి టీటీడీ పర్చేజ్ ఆర్డర్ ఇచ్చింది. టెండర్ పిలిచింది మార్చి 12న, ఫైనల్ చేసింది మే 8న, పర్చేజ్ ఆర్డర్ ఇచ్చింది మే 15న, అగ్రిమెంట్ చేసుకుంది జూన్ 11న.

చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకునే ఒక్కరోజు ముందు అగ్రిమెంట్ ను పకడ్బందీగా వైసీపీ ప్రభుత్వం చేసింది. 2023 నవంబర్ 8న ఒక టీటీడీ టెక్నికల్ టీమ్ ఏఆర్ ఫుడ్స్ కంపెనీ పరిశీలనకు వెళ్లింది. ఏఆర్ డెయిరీ సంస్థ 2022-2023 సంవత్సరానికి 14,940 కిలోలు(14.9టన్నులు) మాత్రమే బల్క్‌గా సరఫరా చేసినట్లు టెక్నికల్ టీమ్ నిర్ధారించింది. ఏఆర్ ఫుడ్స్ డెయిరీ కంపెనీ ఉత్పత్తి సామర్థ్యం నెలకు సుమారు 16 టన్నులు మాత్రమే. దీని ప్రకారం చూస్తే 6 నెలలకు దాదాపు 100 టన్నుల నెయ్యి మాత్రమే ఏఆర్ డెయిరీ ఉత్పత్తి చేయగలదు. కానీ 6 నెలల్లో టీటీడీకి వెయ్యి టన్నుల నెయ్యి సరఫరా చేసేందుకు ఏఆర్ డెయిరీకి కాంట్రాక్టు ఇచ్చారు.

**ఆ ట్యాంకర్లు ఎక్కడెక్కడ తిరిగాయి?**

ఏఆర్ డెయిరీ టీటీడీకి 8 ట్యాంకులు నెయ్యిని సరఫరా చేసింది. వాటిలో 4 ట్యాంకులు పంపితే దాన్ని వాడారు, మిగిలిన 4 ట్యాంకులను టీటీడీ వెనక్కి పంపించింది.

జూన్ 4, 2024న ఏఆర్ ఫుడ్స్ నుండి టీటీడీకి మొదటి నెయ్యి ట్యాంకర్ %ూ్రా26ుజ%4779 దిండిగల్ నుండి బయలు దేరింది. ఈ లారీ జూన్ 12, 2024న తిరుమలలోని టీటీడీకి చేరింది. దిండిగల్ నుండి తిరుమలకు కేవలం 500 కిలోమీటర్ల దూరం మాత్రమే. ఈ దూరం ప్రయాణించడానికి 8 రోజుల ప్రయాణం పడుతుందా? 8 రోజుల పాటు ఈ లారీ ఎక్కడెక్కడ తిరిగి కల్తీ నెయ్యిని తీసుకువచ్చింది?

జూన్ 11న ఏఆర్ ఫుడ్స్ నుండి బయలుదేరిన 2వ నెయ్యి ట్యాంకర్ 20న (10రోజులకు) టీటీడీ ఇన్ గేటుకు చేరింది. 24 జూన్ 2024న స్టోరేజీ ప్లేస్ కు వెళ్లింది.

2024 జూన్ 19న మూడవ ట్యాంకర్ ఏఆర్ ఫుడ్స్ నుండి బయలుదేరి 2024 జూన్ 25న (7రోజులకు) టీటీడీకి చేరింది.

జూన్ 27న బయలుదేరిన 4వ ట్యాంకర్, జూలై 4న(8 రోజులకు) ఇన్ గేట్ లోకి వచ్చింది. జూలై 12న స్టోరేజీ ప్రాంతానికి చేరింది.

ఏఆర్ ఫుడ్స్ కంపెనీ టీటీడీకి అవసరమైనంత నెయ్యి ఉత్పత్తి, సరఫరా చేసే సామర్థ్యం లేక, తమ ట్యాంకర్లను వివిధ ప్రాంతాలకు పంపి, కల్తీ నెయ్యిని ట్యాంకర్లలో నింపి, తిరుమలకు తీసుకొచ్చేందుకు 8 రోజుల సమయం పట్టిందా?

ఏఆర్ ఫుడ్స్ సరఫరా చేసిన కల్తీ నెయ్యి వెనుక ఎవరెవరి హస్తం ఉందో నిగ్గు తేల్చడానికే మా ప్రభుత్వం సిట్ వేసింది. సుప్రీం కోర్టు మార్గదర్శకాలతో సిట్ విచారణను వేగవంతం చేసి దోషులను కఠినంగా శిక్షిస్తాం... అని పట్టాభి స్పష్టం చేశారు.

## తిరుమల లడ్డూ వివాదంపై నేడు సుప్రీంకోర్టులో విచారణ

తిరుమల శ్రీవారి లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగం వ్యవహారం సుప్రీంకోర్టు వరకు వెళ్లిన సంగతి తెలిసిందే. లడ్డూ వివాదంలో దాఖలైన పిటిషన్లపై రేపు (అక్టోబరు 4) విచారణ కొనసాగించనున్నారు. జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని బెంచ్ నేడు మరో కేసును విచారించాల్సి ఉండడంతో, లడ్డూ కేసును శుక్రవారం ఉదయం 10.30 గంటలకు వాయిదా వేశారు. ఇవాళ ఓ ముఖ్యమైన కేసు విచారణ ఉందని, లడ్డూ కేసు విచారణ కోసం ఆ కేసును ఆపడం సరికాదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విజ్ఞప్తి చేశారు. ఆయన విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న సుప్రీం ధర్మాసనం ఇవాళ మరో కేసుపై విచారణ చేపట్టాలని నిర్ణయించింది. లడ్డూ కేసును రేపటికి వాయిదా వేసింది. లడ్డూ కల్తీ వ్యవహారంపై విచారణను సుప్రీంకోర్టు పర్యవేక్షణలో జరపాలంటూ ఇటీవల బీజేపీ సీనియర్ నేత సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్ వేయడం తెలిసిందే. వైసీపీ రాజ్యసభ సభ్యుడు, టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కూడా ఈ వివాదంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై సెప్టెంబరు 30న విచారణ జరిపిన సుప్రీంకోర్టు తదుపరి విచారణను అక్టోబరు 3కి వాయిదా వేసింది. అయితే, నేడు ఓ కీలకమైన కేసు ఉన్నందున లడ్డూ వ్యవహారంపై విచారణ సాధ్యపడలేదు.

## పంచాయితీ ఎన్నికలు: ఓటర్ల తుది జాబితా విడుదల చేసిన ఈసీ..

పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితాను ఎన్నికల కమిషన్ విడుదల చేసింది. రాష్ట్రంలోని 33 జిల్లాల పరిధిలో 12,867 పంచాయతీల్లో 1,67,33,584 మంది ఓటర్లున్నట్టు తెలిపింది. ఇందులో 82,04,518 పురుషులు, 85,28,573 మహిళలు, 493 ఇతరులు ఉన్నారని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో పురుషుల కన్నా మహిళలే అత్యధికంగా ఉన్నట్టు ఈసీ గణాంకాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా.. రాష్ట్ర ప్రభుత్వం వార్డులు, పంచాయతీల రిజర్వేషన్ అంశంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నది. రిజర్వేషన్ల ప్రక్రియ కొలిక్కి వస్తేనే ఎన్నికల నిర్వహణకు అడుగులు ముందుకు పడే అవకాశం ఉంది. కులగణన పూర్తి చేసిన తరువాతే రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీంతో కులగణన పూర్తయి, రిజర్వేషన్లు ఖరారయ్యాకే ఎన్నికలు జరగనున్నాయి.

## రాష్ట్ర ఆదాయం పడిపోతోంది... పరిపాలనా వైఫల్యానికి నిదర్శనం

:రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం క్రమంగా పడిపోతోందని, పరిపాలనా వైఫల్యానికి ఇది నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. 'తగ్గుతున్న సర్కార్ ఆమ్దానీ' పేరుతో 'వెలుగు' పత్రికలో వచ్చిన కథనాన్ని కేటీఆర్ తన ట్వీట్‌కు జత చేశారు. ప్రభుత్వ ఆదాయం పడిపోతోందని, అనుభవరాహిత్యంతోనే ఈ అనర్థమని పేర్కొన్నారు. సంపదను సృష్టించి పేదలకు పంచే తెలివి ఈ ముఖ్యమంత్రికి లేకపోవడమే సమస్య అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది నుంచే ఈ దుస్థితి ఏర్పడితే రానున్న నాలుగేళ్లు మరింత కష్టమే అని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ గడ్డు పరిస్థితులను మరింత దిగజార్చే చేష్టలే తప్ప దిద్దుబాటు చర్యలు కనుచూపు మేర కూడా కనిపించడం లేదని ఆరోపించారు. తెలంగాణ ప్రగతి పథానికి పాతరేసిన పాపం... మార్పు మార్పు అంటూ మోసం చేసిన కాంగ్రెస్‌దే అంటూ తన ట్వీట్ ముగించారు.

## సన్నవడ్ల కొనుగోలుకు ప్రత్యేక కేంద్రాలు

- మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేసినట్టు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఇవాళ సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడుతూ.. అవసరమైన చోట కేంద్రాలను తెరవాలని సూచించారు. ఐకేపీ సెంటర్లకు సీరియల్ నంబర్ ఇవ్వాలని సన్నవడ్లపై ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని అన్నారు.ధాన్యం కొనుగోళ్లలో వ్యవసాయ అధికారులను ఇన్ వాల్వ్ చేయాలని సూచించారు.కలెక్టర్లు ప్రతి రోజూ ధాన్యం కొనుగోళ్లపై రెండు గంటలపాటు సమీక్ష చేయాలని సూచించారు. గన్నీ సంచుల కొరత లేకుండా చూడాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రత్యేకంగా కాల్ సెంటర్లు ఏర్పాటు చేసి రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. కలెక్టర్లు క్షేత్ర పర్యటనలు చేయాలని అన్నారు. తాలు,తరుగు,తేమ పేరుతో రైతులను మోసం చేసేవారిని సహించవద్దు. క్రిమినల్ కేసులు పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో వందశాతం రైతులు సన్నబియ్యం పండించేలా చొరవ చూపించాలని అన్నారు.

## పేదల ఇళ్లు కూల్చితే ఊరుకోం..

- మొదటి పేజీ తరువాయి

ఈ కూల్చివేతల విధ్వంసాన్ని ఆపాలని ఇప్పటికే సీఎంకు లేఖ రాసిన్నట్లుగా ఆయన తెలిపారు. 'పేదల ఇళ్ళ కూల్చివేతలను తీవ్రంగా ఖండిస్తున్నాం. వెంటనే ఆపేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచకుండా మూసీ సుందరీకరణ ఎవరికి కావాలి?. లక్షన్నర కోట్లల్లో సగం ఖర్చుతో సిటీలో డ్రైనేజీ వ్యవస్థ సెట్ చేయండి. డ్రైనేజీ, వరద నీటి డ్రైన్ల మీద శ్రద్ధ పెట్టండి. మూసి సుందరీకరణ అంటే ముందు రిటైనింగ్ వాల్ కట్టండి. హైడ్రాను పుట్టించిన రేవంత్ రెడ్డికి ధైర్యం ఉంటే ఫాం హౌజ్‌లు , బడా బిల్డింగ్ లు కట్టిన వాళ్ళవి కూల్చండి. ఓవైసీ ఫాతిమ కాలేజీ ఎందుకు కూల్చడం లేదు? పెద్ద పెద్ద కంపెనీలను పిలిచి, ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారు. పేదల ఇళ్లను కూల్చితే ఈ ప్రభుత్వం కూలిపోతుంది. పేదల ఇళ్ళ కూల్చివేతలను సహించేది లేదు. కూల్చివేతలపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి. మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్న. ఇలాంటి వ్యాఖ్య లు చేసినవారిని బహిష్కరించాలి. ఇలా మాట్లాడటం కేసీఆర్ మొదలు పెట్టారు. దాన్ని కేటీఆర్ ముందుకు తీసుకెళ్లారు. సీఎం రేవంత్ కూడా కొనసాగిస్తున్నారు. మార్పు రావాల్సి ఉంది. కుటుంబాలు, మహిళల గురించి అనుచితంగా మాట్లాడటం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు అలవాటు అయిందని ' అని కిషన్ అన్నారు.

## వైజాగ్ స్టీల్ అమ్మేస్తున్నామనడం సత్యదూరం

- మొదటి పేజీ తరువాయి

భాగంగానే కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించారని ఆరోపిస్తూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఎక్స్‌లో చేసిన ఆరోపణలకు ఆయన బదులిచ్చారు. "స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించారన్న విషయం నా దృష్టికి వచ్చిన 48 గంటల్లోనే వారిని తిరిగి నియమించాం. సెప్టెంబరు 27న తొలగించిన 4,200 మంది కాంట్రాక్ట్ కార్మికులను 29న మళ్లీ విధుల్లోకి తీసుకున్నాం. స్వప్రయోజనాలు, ఓటుబ్యాంకు రాజకీయాల కోసం ఈ అంశాన్ని వాడుకోవడం మానండి. ఇప్పటివరకు రద్దుచేసిన 3,700 మంది కాంట్రాక్ట్ లేబర్ పాసులను ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా త్వరలో పునరుద్ధరిస్తామని ఆర్ఐఎన్ఎల్ యాజమాన్యం ఇప్పటికే స్పష్టంగా చెప్పింది. కార్మికుల బయోమెట్రిక్ డేటాను త్వరలో పునరుద్ధరిస్తాం. ప్రస్తుతం ఉన్న గేట్‌పాస్ వ్యవస్థతో పాటు అవసరమైన సౌకర్యాలను కొనసాగించడానికి అన్ని పక్షాలూ చర్చల సమయంలో అంగీకరించాయి. ఎన్డీయే ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ను అమ్మేస్తోందని మీరు చేసిన నిరాధార ఆరోపణలు పూర్తిగా సత్యదూరం. ప్రస్తుతం ప్రభుత్వరంగ సంస్థలను సరిగా నిర్వహించడంతో గత మూడేళ్లలో వాటి షేర్ విలువ అద్భుతంగా పెరిగింది" అని కుమారస్వామి పేర్కొన్నారు.

# లక్ష్మీ నరసింహ స్వామి వారికి శాస్త్రానుసారంగా పవిత్రోత్సవములు



**సికె న్యూస్ సూర్యాపేట జిల్లా ప్రతినిధి రామయ్య అక్టోబర్ 03:**మట్టపల్లి మహక్షేత్రములో శ్రీ రాజ్యలక్ష్మి, చెంచులక్ష్మీ, భక్త ప్రహ్లాద సహిత యోగానంద లక్ష్మీనరసింహ స్వామి వారికి త్రయాహ్నిక దీక్షగా వైఖానస శాస్త్రానుసారంగా పవిత్రోత్సవములు తేది: 30-09-2024 నుండి 03-10-2024 వరకు అత్యంత వైభవముగా నిర్వహించబడునున్నవి.

గరువారం ఉదయం 8-00 గం,లకు అగ్ని ఆరాధనలు. పూర్ణాహుతి, పవిత్రవిసర్జనోత్సవము, సప్తదశకుంభారోపణం, శాంతికళ్యాణ మహోత్సవము, ఆచార్య సన్మానం కార్యక్రమములు జరిగినవి. యాజ్ఞిక నిర్వాహణ ఆగమ ప్రవర బొర్రా వాసు దేవాచార్యులు, ముత్తారంగ్రామం ఖమ్మం జిల్లా వారి ఆద్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించ బడుచున్నవి. ఇట్టి కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్కుమార్, కార్యనిర్వహణాధికారి సిరికొండ నవీన్, తూమాటి శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు, బ్రహ్మాచార్యులు, ఫణిభూషన మంగాచార్యులు, పద్మనాభా చార్యులు, బదరీనారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, మరియు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్పెషల్ కంపెయిన్ 4.0 రెండవ దశ కార్యక్రమంను ప్రారంభించిన కొత్తగూడెం ఏరియా జిఎం .



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),అక్టోబర్ 03,**సెక్రటరీ మినిస్ట్రీ ఆఫ్ కోల్ ఆదేశాను సారం సింగరేణి వ్యాప్తంగా స్పెషల్ కంపెయిన్ 4.0 రెండవ దశ కార్యక్రమం ను నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగా గురువారం కొత్తగూడెం ఏరియాలోని రుద్రంపూర్ ఎస్.బి.ఐ బ్యాంక్ లైన్ నందు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు హాజరుకావడమైనది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన సంస్థ సి%డ%ఎండి ఎన్ బలరాం దిశా నిర్దేశాలతో సింగరేణి వ్యాప్తంగా ఈ నెల సెప్టెంబర్ 16 వ తేదీ నుండి సెప్టెంబర్ 30 వ తేదీ వరకు ప్రిపరెటరీ ఫేస్ (సన్నాహక దశ) స్వచ్ఛతా పై వివిధ కార్యక్రమానికి పిలుపు నిచ్చారని అందులో భాగంగా కొత్తగూడెం ఏరియాలోని అన్ని గనులు, డిస్పెంసరీలలో, డిపార్ట్మెంట్లలో, ఆఫీసులలో స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహిస్తున్నామని అన్నారు.

ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం క్లీన్లెన్స్ ఆఫ్ సైట్స్ ఫర్ స్పేస్ మేనేజ్మెంట్ అండ్ బ్యూటీఫికేషన్ ఆఫ్ ఆఫీసెస్ అని తెలియజేసారు. అనంతరం అక్టోబర్ మాసం 02 వ తేదీ నుండి 31వ తేదీ వరకు ఇంప్లిమెంటేషన్ పేస్ (ఆచరణ దశ) గా వివిధ స్వచ్ఛత కార్యక్రమాలు చేయడం జరుగుతుందన్నారు అందులో భాగంగా రుద్రంపూర్ ఎస్.బి.ఐ బ్యాంక్ లైన్ నందు ఈ స్వచ్ఛత కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అధికారులు అందరితో కలిసి పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు అలాగే అందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అలాగే వారి ఇంటి యందు, పనిచేసే స్థలాలు, కార్యాలయాల యందు మరియు చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెట్లను పెంచాలని తద్వారా పర్యావరణమును సమతుల్యం అవుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా పని వద్ధ, ఇంటి వద్ద పరిశుభ్రత పాటించాలని, ప్లాస్టిక్ నివారణ, ప్రచారము వంటి మొదలుగు స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే స్వచ్ఛత గురించి వివరించారు.

ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జిఎంతో పాటు ఏఐటియుసి యూనియన్ ప్రతినిధి వీరయ్య, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్, జిఎం ఆఫీస్ ఫిట్ సెక్రటరీ సిహెచ్ సాగర్, ఎస్ ఓ టు జిఎం జీవి కోటిరెడ్డి, ఏజిఎం (సివిల్) సిహెచ్ రామకృష్ణ, డిజిఎం (పర్సనల్) బి. శివ కేశవరావు, అధికారులు ఎస్. సదానందం, ఎన్.యోహన్, ఎం.మురళి, అచ్యుతరామయ్య, బి మాధవ్, కే.శేషాశ్రీ, బి.తౌర్య ఇతర అధికారులు మరియు కాంట్రాక్ట్ పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థికి అండగా

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- కడియం ఫౌండేషన్ ద్వారా మెడికల్ విద్యార్థికి ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే.



**సీకే న్యూస్ అక్టోబర్ మూడు అనుమకొండ జిల్లా ధర్మసాగర్ ,మండలం ప్రతినిధి కమలాకర్:**ధర్మసాగర్ మండలం దేవునూర్ గ్రామానికి చెందిన చిట్యాల నితిన్ మహబూబాబాద్ లోని మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు సాధించి ఆర్థిక స్తోమత లేక ఇబ్బంది పడుతున్న విషయం ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి రావడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కడియం ఫౌండేషన్ ద్వారా కళాశాల ఫీజు నిమిత్తం మెడికల్ విద్యార్థి చిట్యాల నితిన్ కు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావడంతో పాటు పేద ప్రజలకు సేవ చేయాలని సూచించారు. దింతో తన పరిస్థితిని అర్థం చేసుకొని ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి, కడియం ఫౌండేషన్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రోడ్లు మరియు డ్రైనేజ్లు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),అక్టోబర్ 03,,**

భద్రాచలం మండలంలో వివిధ కాలనీలో రోడ్లు మరియు డ్రైనేజ్ పనులకు శంకుస్థాపనల కు ముఖ్య అతిథిగా పాల్గొన్న భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు. శాంతి నగర్ కాలనీ, సుభాష్ నగర్ కాలనీ, అశోక్ నగర్ కొత్త కాలనీ, ఎ ఎస్ ఆర్ కాలనీ, ఆదర్శ నగర్ కాలనీ, అభయ ఆంజనేయ స్వామి పార్క్ ఎదురుగా డ్రైనేజీ మరియు కాలనీలో రహదారి లేక ఇబ్బంది పడుతున్నమని కాలనీవాసులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేని కలిసి వారి సమస్యలు పై వినతి పత్రం సమర్పించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు రోడ్లు మరియు డ్రైనేజీల కు సంబంధించిన అధికారులతో మాట్లాడి పై చెప్పిన కాలనీలో రోడ్లు మరియు డ్రైనేజీలు ఎస్టిమేట్ వేసి నిధులు మంజూరు చేశారు.

అట్టి పనులను గురువారం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. కాలనీవాసులు ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుకు బ్రహ్మ రథం పట్టారు. ఎ ఎస్ ఆర్ కాలనీ వాసుల 20 ఏళ్ల నాటి కలను నెరవేర్చిన భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు. సుభాష్ నగర్ కాలనీలో అయ్యా మీరు ఎమ్మెల్యే అయ్యాక మొన్న వర్షాలకు గోదావరి వరద నీరు కాలనీ లోకి రాకుండా కరకట్ట నిర్మించడం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. మీలాంటి ఎమ్మెల్యేని గెలిపించుకోవడం మాకు ఆనందంగా ఉందని తెలిపారు. అశోక్ నగర్ కాలనీలో కరెంటు స్తంభాలు లేక ఇబ్బంది పడుతున్నారని తెలుపగా అధికారులతో మాట్లాడి కరెంటు స్తంభాలు వేయాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్ భోగాల శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు రత్నం రమాకాంత్, బొంబోతుల రాజీవ్, రత్నం రజనీకాంత్, ఎండి నవాబ్ , అరికెల తిరుపతిరావు, పెద్దినేని శ్రీనివాస్ , నర్రా రాము, చుక్క సుధాకర్, మామిడి పుల్లారావు, భీమవరపు వెంకటరెడ్డి, చెగొండి శ్రీనివాస్, దుద్దుకురి సాయిబాబా, ఒగ్గె రమణ, కాపుల శ్రీను, రసమళ్ళ రాము, యూత్ నాయకులు గాడి విజయ్, ఆకుల వెంకట్, పుల్లగిరి నాగేంద్ర, అవ్వూనురి దుర్గ ప్రసాద్, కొప్పుల రాజా, జామిర్, మహిళలు గంగా భారతి , లక్ష్మి కాంతం, కాసింబీ, సాయి కుమారి తదితరులు పాల్గొన్నారు...

# కుటుంబ సభ్యుల వివరాల సేకరణ,డిజిటల్ కార్డుల జారీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి...





- జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జెండగే




**సి కే న్యూస్ (సంపత్) అక్టోబర్ 03:**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుటుంబ సభ్యుల వివరాల సేకరణ, డిజిటల్ కార్డుల జారీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జెండగే సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం రోజున బీబీనగర్ మండలంలోని మహాదేవ్ పూర్ గ్రామములో జరుగుతున్న ఇంటింటి సర్వేను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఫ్యామిలీ డేటా బెస్ ఆధారంగా అధికారులు నిర్వహిస్తున్న సర్వే తీరును కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు.ప్రతి ఇంటికి వెళ్లి ఆయా కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి, నమోదు కానీ పేర్లు నమోదు చేయాలని సూచించారు.ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా అన్ని వివరాలను సక్రమంగా సేకరించాలని అన్నారు.నిర్ణీత సమయం లోపు పైలెట్ సర్వే ను పూర్తి చేయాలని,ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఏ ఒక్క కుటుంబం కూడా తప్పిపోకుండా డిజిటల్ సర్వే నిర్వహించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, మండల తహసిల్దార్ శ్రీధర్,రెవిన్యూ ఇన్స్పెక్టర్, పంచాయతీ సెక్రెటరీ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటి పరిధిలో పైలెట్ ప్రాజెక్టుగా జరుగుతున్న ప్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్



**సీ కే న్యూస్ ప్రతినిధి ( వైరా నియోజకవర్గ ఇన్చార్జి )** ఏదునూరి సైదులు వైరా మున్సిపాలిటీ పరిధిలో 14 వ వార్డులో పైలెట్ ప్రాజెక్టుగా జరుగుతున్న ప్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్.ప్రతి ఇంటికి వెళ్లి ఆయా కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి, నమోదు కానీ పేర్లు నమోదు చేయాలని సూచించారు.ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా అన్ని వివరాలను సక్రమంగా సేకరించాలని అన్నారు.నిర్ణీత సమయం లోపు పైలెట్ సర్వే ను పూర్తి చేయాలని,ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఏ ఒక్క కుటుంబం కూడా తప్పిపోకుండా డిజిటల్ సర్వే నిర్వహించాలని అన్నారు. ఇట్టి కార్యక్రములో మున్సిపల్ కమిషనర్ చింతా వేణు , తహశీల్దార్ శ్రీనివాసరావు , వార్డు కౌన్సిలర్ కోటయ్య , మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# డిజిటల్ కార్డు సర్వే ప్రక్రియను పరిశీలించిన జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్ర మోహన్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,( సాయి కౌశిక్),అక్టోబర్ 03,**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డిజిటల్ కార్డు సర్వే ప్రక్రియ లో భాగంగా జిల్లాకు కేటాయించిన ప్రత్యేక అధికారి సీనియర్ అధికారి సురేంద్ర మోహన్ పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని పదవ వార్డు మరియు ఇల్లందు మండలం పూబల్లి గ్రామంలో నిర్వహిస్తున్న డిజిటల్ కార్డు సర్వేను అధికారులకు తగు సూచనలు చేశారు . ఈ సందర్భంగా ఆయన కుటుంబ సమాచారం ఆధారంగా అధికారులు చేస్తున్న సర్వే తీరును ఆయన పరిశీలించారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా అన్ని వివరాలను సక్రమంగా సేకరించాలన్నారు. నిర్ణీత సమయం లోపు పైలట్ సర్వే ని పూర్తి చేయాలని, ప్రతి ఇంటిని సందర్శిస్తూ ఒక్క కుటుంబం వివరాలు తప్పిపోకుండా డిజిటల్ సర్వే నిర్వహించాలన్నారు. ఇంటి యజమానిగా మహిళా పేరు ఉండాలని, తదుపరి కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేయాలని సూచించారు.అనంతరం కుటుంబ సభ్యుల అంగీకారంతో మొబైల్ ఫోన్ లో ఫోటో తీసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, కొత్తగూడెం ఆర్డీవో మధు, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ డాకుసింగ్, ఇల్లందు మున్సిపల్ కమిషనర్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ గిరిజన బీ ఈ డీ కళాశాలలో ఘనంగా “బతుకమ్మ వేడుకలు”



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),అక్టోబర్ 03,**తెలంగాణ రాష్ట్ర బతుకమ్మ పండుగ ఉత్సవాలను పురస్కరించుకొని ప్రిన్సిపాల్ డా.యం.వీరనాయాక్ అధ్యక్షతన గురువారం ప్రభుత్వ గిరిజన బీ ఈ డీ కళాశాలలో ఘనంగా “బతుకమ్మ వేడుకలు” నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు అందరూ పూలతో అందమైన బతుకమ్మలను ఏర్పాటు చేసి సాంప్రదాయ పద్ధతిలో వేడుకలను నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ డా.యం. వీరనాయాక్ మాట్లాడుతూ బతుకమ్మ విశిష్టతను గుర్తుచేసారు. ప్రకృతిని కాపాడుకుంటూ,ప్రకృతి యొక్క గొప్పతనాన్ని గుర్తించి గౌరవించు కోవడమే బతుకమ్మ పండుగ అంతర్యమని అభిప్రాయపడ్డారు. మన జీవితం ప్రకృతితో ముడిపడి ఉంటుంది అని , ప్రకృతి బాగుంటే మానవాళి బాగుంటుంది అని.. అందువలనే మనం ప్రకృతిని దైవంగా భావించి పుజిస్తామని అన్నారు. ప్రకృతి లో లభించే ఔషధ గుణం కలిగిన పూలతో వేడుక చేసుకోవడం యొక్క అంతర్యం అందరూ ఆరోగ్యంగా ఉండాలి అని భావించి ప్రకృతినే “బతుకమ్మ” గా భావించి పండుగ చేసుకుంటామ అని, అందువలనే “బతుకమ్మను బ్రతుకు ఇచ్చు అమ్మ” అంటారు అని అన్నారు. నేటి యువత మన సంస్కృతి సాంప్రదాయాల అంతర్యాన్ని గుర్తించి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఉంది అని అన్నారు. ప్రకృతిని మనం కాపాడుకుంటే ప్రకృతి మనల్ని కాపాడుతుంది అనే సత్యం గుర్తించాలి అని మన పెద్దలు ఇటువంటి పండుగలను మనకు అందించారని అన్నారు. ప్రకృతి ని గౌరవించి , కాపాడుకునే బతుకమ్మ పండుగ మన తెలంగాణ రాష్ట్ర పండుగ కావడం మన అందరికి గర్వకారణం అని అన్నారు.

నూటికి నూరుశాతం వెనుకబడిన మారుమూల గిరిజన విద్యార్థుల కోసం ఏర్పాటు చేయబడిన గిరిజన బీ ఈ డీ కళాశాలలో ప్రకృతి బిడ్డలైన గిరిజన విద్యార్థులతో బతుకమ్మ వేడుకలు నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉంది అని.. ఇటువంటి ప్రత్యేక కళాశాలకు ప్రిన్సిపాల్ గా బాధ్యతలు నిర్వర్తించే అవకాశాన్ని ఇచ్చిన ఉన్నతాధికారులకు కృత్జ్ఞతలు తెలియజేస్తూ.. అందరికి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేసారు.

ఈ కార్యక్రమం కళాశాల సాంస్కృతిక విభాగం ఇంచార్జ్ లెక్చరర్ బి.ధనలక్ష్మి , సభ్యులు టి.అరుణ,ఎస్.కె.పర్వీన్, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలి....




- సిఐటియు జిల్లా అధ్యక్షులు కే బ్రహ్మాచారి
- అట హాసంగా సిఐటియు శాఖ మహాసభ

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),అక్టోబర్ 03,ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ కాంట్రాక్ట్ కార్మికుల మొదటి శాఖా మహా సభను ప్రారంభిస్తూ జండా ఆవిష్కరించిన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే బ్రహ్మాచారి మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాదిమంది కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులు అభద్రత భావంతో జీవిస్తున్నారని ఎప్పుడు ఎవరి ఉద్యోగం ఊడుతుందో తెలియని పరిస్థితుల్లో ఉన్నారని అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులనే వారే లేకుండా అందరినీ పర్మినెంట్ చేస్తానని చెప్పినందున ప్రభుత్వం ఆ దశగా ఆలోచన చేసి వారందరికీ భరోసా కల్పించాలని అన్నారు అనంతరం జరిగిన మహా సభలో పాల్గొన్న సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు మాట్లాడుతూ కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పిస్తూ అందరికీ కనీస వేతనం 26,000 ఇవ్వాలని డిమాండ్ చేసినారు కార్మికుల సమస్యల మీద పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు అనంతరం నూతన శాఖ కార్యదర్శిగా అబ్బా రామాను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎంబి నర్సారెడ్డి, నకిరికంటి నాగరాజు పార్టీ సభ్యులు కృష్ణ ,నరసింహారావు, రమణ, అంజలి ,గీత, కుమారి,వెంకటరమణ, మెహబూబా , తదితరులు పాల్గొన్నారు ఎంబి నర్సారెడ్డి

# ధ్రువపత్రాల పరిశీలన పకడ్బందీగా నిర్వహించాలి....

జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),అక్టోబర్ 03, డీఎస్సీ 2024 అభ్యర్థుల ద్రౌపత్రాల పరిశీలన సమర్థవంతంగా నిర్వహించాలని అభ్యర్థులకు ఎటువంటి సందేహాలు ఉన్న తక్షణమే నివృత్తి చేస్తూ సానుకూల వాతావరణంలో పరిశీలన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాలలో డీఎస్సీ 2024 కు 1:3 నిష్పత్తిలో ఎన్నికైన అభ్యర్థుల ద్రోపత్రాలన పరిశీలన సరళిని పరిశీలించిన కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారికి పలు సూచనలు చేశారు. ధ్రువపత్రాల పరిశీలన ఐదవ తేదీ కల్లా పూర్తి కావలసి ఉన్నందున మరికొంతమంది సిబ్బందిని నియమించు కొని పరిశీలనా ప్రక్రియ త్వగతిన పూర్తి చేయాలని అలాగే అభ్యర్థులకు గాని పరిశీలకులకు గాని ఎటువంటి సందేహాలు వచ్చినా వెంటనే రాష్ట్ర అధికారులతో సమన్వయం చేసుకొని సందేహాన్ని వృత్తిని చేసుకొని ఎటువంటి దోషాలకు తావు లేకుండా పరిశీలన పూర్తి చేయాలని ఆదేశించారు. అభ్యర్థులతో మాట్లాడుతూ ఎటువంటి ఆందోళనకు గురికాకుండా ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేయించు కుని వెళ్లాలని తెలిపారు. అనంతరం వివిధ కౌంటర్లలో రూపాత్రాలను పరిశీలిస్తున్న సిబ్బందితో మాట్లాడి పరిశీలనా సరళిని తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చిన అభ్యర్థులకు సరైన మార్గదర్శకత్వం వహిస్తూ పరిశీలన ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహిస్తున్న విద్యాశాఖను అభినందించారు.

# మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు మహిళ లోకానికి సిగ్గుచేటు



సీ కే న్యూస్ ప్రతినిధి ( వైరా నియోజకవర్గ ఇన్చార్జ్ ) ఏదునూరి సైదులు అక్టోబర్ 03
తెలంగాణ మహిళా మంత్రి మీరు రాజకీయంగా ఎదగాలి అనుకుంటే ప్రజలకు సేవ చేయాలి. కానీ సినీ హీరోయిన్లను వారి వ్యక్తిగత జీవితాలతో చెలగాటం ఆడటం సరికాదని , ఆమె వ్యాఖ్యలకు తెలంగాణ మహిళా లోకం మొత్తం సిగ్గు పడతా ఉంది. ఇకనైనా మీరు మంచి భాషతో ప్రతి స్త్రీని గౌరవించు బుద్ధిని భగవంతుడు మీకు ఇవ్వాలని కోరుకుంటున్నాను. అని వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ %దీ=ా% జిల్లా నాయకులు మూళ్లపాటి సీతారాములు పేర్కొన్నారు.

# యూనిటీ ఫార్మసీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు

సి కే న్యూస్ (సంపత్) అక్టోబర్ 03:భువనగిరి పట్టణ శివారులో గల రాయగిరి లోగల యూనిటీ ఫార్మసీ కళాశాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మలతో కళాశాలకు ఆటపాటలతో సందడి చేశారు.మన సంస్కృతి సంప్రదాయాలతో బతుకమ్మ పాటలతో హోరెత్తించారు.విద్యార్థినిలు సంప్రాదాయ దుస్తులు ధరించి రంగురంగుల బతుకమ్మలను కళాత్మకంగా పేర్చి విద్యార్థినులు మహిళా అధ్యాపకులు ఆడి పాడారు.ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఏ ప్రభాకర్ రెడ్డి డైరెక్టర్ పి గోవర్ధన్ రెడ్డి ఫార్మసి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అంపటి శ్రీనివాస్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్ సరిత ఏవో సునీత , ఏ



ప్రియాంక అనిత పారిజాత దివ్య అమూల్య ఉమా శ్వేత సాహితి రెడ్డి నాగరాజు అహ్మద్ విద్యార్థి విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



సి కే న్యూస్ (సంపత్) అక్టోబర్ 03:జనగామ నియోజకవర్గం కొమురవెల్లి మండలం గురువన్న పేట గ్రామంలో మైనర్ బాలిక పై జరిగిన అత్యాచార కేసుకు సంబంధించిన బాధిత కుటుంబాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య,ఎమ్మెల్సీ,రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు ఎగ్గె



మల్లేశం,కురుమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లేశం పరామర్శించారు.వారి కుటుంబాన్ని అన్నివిధాలుగా అండగా ఉంటామన్నారు.ముందుగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ ను కలసి దీనికి కారణమైన నిందితుడిని చట్టం ప్రకారం కఠినంగా శిక్షించాలన్నారు.అదేవిధంగా బాధ ఆవేశం తో ఇంటివద్ద ఉద్రిక్తత నెలకొన్న సందర్భంలో బాలికకు సంబంధించిన పలువురు కుటుంబ సభ్యులు గ్రామస్తులపైన కేసు నమోదును వెనక్కి తీసుకోవాలని సీపికి తెలపడం జరిగింది.

# శ్రీ దేవి శరన్నవరాత్రుల సందర్భంగా పెద్దమ్మతల్లి పూజలు.

పాల్గొన్న రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్, డి సి ఎం ఎస్ చైర్మన్ కొత్వాల



సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్), అక్టోబర్ 03, పాల్వంచ మండల పరిధిలోని జగన్నాధపురం శ్రీ కనకదుర్గ దేవాలయం (పెద్దమ్మతల్లి గుడిలో) శ్రీ దేవి శరన్నవరాత్రుల సందర్భంగా గురువారం జరిగిన ప్రారంభ పూజల్లో డి సి ఎం ఎస్ చైర్మన్, రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయం కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీకుమారి ఆధ్వర్యంలో పూజారులు కొత్వాలలి ను పూలమాల, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి సభ్యులు బరపటి వాసుదేవరావు, పెద్దమ్మతల్లి దేవస్థానం మాజీ డైరెక్టర్లు ఎస్వికే ఆచార్యులు, చింతా నాగరాజు, గంధం వెంగళరావు, కాంగ్రెస్ నాయకులు వై. వెంకటేశ్వర్లు, కాపర్తి వెంకటాచారి, సందు ప్రభాకర్, గంధం నర్సింహారావు, బాదర్ల జోషి, గంధం సతీష్, అజ్మీరా రమేష్, బానోత్ బాలాజీ, ఉడుగుల రాము, బండి ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లిపాడు ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు ఆధ్వర్యంలో 8వ సంవత్సరం దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం






సి కే న్యూస్( వైరా నియోజకవర్గ ఇన్చార్జ్) ఎదునూరి సైదులు అక్టోబర్ 03శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం కొణిజర్ల మండలం పల్లిపాడు గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు తాటిపల్లి సుధీర్ ఆధ్వర్యంలో 8వ సంవత్సరం దేవి నవరాత్రి ఉత్సవాలు ఈరోజు నుంచి ప్రారంభమయ్యాయి.
అందంగా అలంకరించిన మండపాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించి తొలిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
విగ్రహ దాత నల్లమోతు అనంతరామయ్య - పద్మ దంపతులు తొలి పూజలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజ నిర్వహించారు. తొలి రోజు అమ్మవారు బాల త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు.
ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్మించాలి.

- అసమానతలు లేని సమాజం కమ్యూనిస్టులతోనే సాధ్యం.
- సిపిఎం సీనియర్ నాయకులు జిఎస్ శంకర్రావు.

సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),
అక్టోబర్ 03,స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలను సమీకరించి ప్రజా ఉద్యమాలు నిర్మించాలని సిపిఎం సీనియర్ నాయకులు జిఎస్ శంకర్రావు పిలుపు నిచ్చారు. ఇందిరా నగర్, శిల్పి నగర్ సిపిఎం పార్టీ శాఖ మహాసభల సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న ప్రజల జీవితాల్లో మార్పు రావడంలేదని స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పార్టీ కార్యకర్తలు ప్రజలను సమీకరించి ప్రజా ఉద్యమాలు నిర్మించాలని ఆయన అన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలో వచ్చిన ఈ పది సంవత్సరాల కాలంలో పేదరికం, నిరుద్యోగం రోజు రోజుకీ తీవ్రంగా పెరిగిందని అన్నారు. దేశ సంపద కొద్ది మంది చేతులలో పోగుపడి అసమానతలు తీవ్రంగా పెరిగాయని ఆయన అన్నారు. బిజెపి ప్రభుత్వం సంపన్న వర్గాల అభివృద్ధికి మాత్రమే పనిచేస్తుందని కార్మికులను, పేదలను విస్మరిస్తుందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో



అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు వేయడంలో వైఫల్యం చెందిందని విమర్శించారు. అర్హులైన వారందరికీ పక్కా గృహాలు మంజూరు చేయాలని పింఛన్లు, రేషన్ కార్డులు ఇవ్వాలని మహాసభలో తీర్మానంచేయడం జరిగింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వా విధానాల వల్ల తీవ్ర అసమానతలు తిరిగాయని అన్నారు. అసమానతలు లేని సమాజం కమ్యూనిస్టుల తోనే సాధ్యమని జిఎస్ శంకర్రావు రావు అన్నారు. మహాసభకు ముందు పార్టీ పతాకాన్ని జయశంకర్ రావు గారు ఆవిష్కరించారు. ఈక్ మహాసభలో పార్టీ పట్టణ కార్యదర్శి గద్దం స్వామి క్షేత్ర కార్యదర్శి గుండోజు రాధా, కుమారి ,వెంకటమ్మ, కమల, రాణి ,స్వరాజ్యం, సరస్వతి, మంగయ్య ,ఆశ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం




సికే న్యూస్( సంపత్) అక్టోబర్ 04:శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం యాదగిరిగుట్ట మండలంలోవైభవంగాప్రారంభమయ్యాయి.అందంగాఅలంకరించిన మండపాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించి.తొలిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు.యాదగిరిగుట్ట మండలం సాదువెల్లి గ్రామంలో విగ్రహ దాత డొంకెన బాలరాజు,బాలమణి దంపతులు తొలి పూజలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజ నిర్వహించారు.తొలి రోజు అమ్మవారు బాల త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు.ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

# ఘనంగా అలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు...



సి కే న్యూస్ (సంపత్) అక్టోబర్ 03:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బతుకమ్మ పండుగ సంబరాలను మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా



నిర్వహించారు.విద్యార్థినులు, అధ్యాపకులు తో కలిసి కళాశాలలో బతుకమ్మను తీరొక్క పూలతో పేర్చి,ఊరేగింపుగా తీసుకొని వచ్చి కళాశాల ఆవరణలో ప్రతిష్టించి ఆట పాటలతో అలరించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారాం మాట్లాడుతూ..బతుకమ్మ సంబరాలు ఏర్పాటు చేసినా కళాశాల టీచింగ్ నాన్-టీచింగ్ సిబ్బందిని



కొనియాడారు.ఈ కార్యక్రమం లో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మల్లేశం,అకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ రవీందర్,అధ్యాపకులు జనయ్య వెంకటేశ్వర్లు,నంద కుమార్ ముత్యాలు, విద్యాసాగర్, బాలరాజు, వేణు భారతి, సౌజన్య, జ్యోతి, శోభారాణి,నాగమణి,సహజ, చైతన్య , విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు...

సికే న్యూస్:బిజెపి సభ్యత్వ అభియాన్ కార్యక్రమం లో బాగంగా , పార్టీ పెద్దల ఆదేశాల మేరకు ఈ రోజు 03-10-2024 .హన్మకొండ జిల్లాలోని ధర్మసాగర్ మండలంలోని రాపాకపల్లి గ్రామాలలోని బూత్ లలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ధర్మసాగర్ మండల ప్రధాన కార్యదర్శి కొంగంటి సందీప్ గారు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమం లో బూతు అధ్యక్షులు చింత రఘుదీర్, వెంకటేష్ ,రమణ చారి కార్యకర్తలు పాల్గొన్నారు.





## వాత్సల్య ఇంజనీరింగ్ కళాశాల మరియు శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలలో బతుకమ్మ సంబరాలు






**సి కే న్యూస్ (సంపత్) అక్టోబర్ 03:**వాత్సల్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులు మరియు పాలిటెక్నిక్ విద్యార్థులు మరియు శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు బతుకమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా వాత్సల్య విద్యాసంస్థల చైర్మన్ దరిపల్లి నవీన్ కుమార్ గారు మాట్లాడుతూ..తీరొక్క పూలను తెచ్చి పేర్చి ఆడబిడ్డలు సంతోషంగా బతుకమ్మ ఆడుకున్నారు భాద్రపద బహుళపంచమి మొదలుకొని మహాలయ అమావాస్య పిత్ర అమావాస్య వరకు ఆడబిడ్డలు బొడ్డెమ్మలు ఆడుతారు.అనంతరం బతుకమ్మ పండుగ మొదలవుతుంది. నేడు రెండవ రోజు అటుకుల బతుకమ్మ ను మన కళాశాలలో సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా జరుపుకున్నందుకు విద్యార్థులకు ఆడపడుచులకు బతుకమ్మ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. వాత్సల్య విద్యాసంస్థల మరియు శ్రీ చైతన్య జూనియర్ కళాశాల కరస్పాండెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఈ తొమ్మిది రోజులు భక్తిశ్రద్ధలతో తొమ్మిది రకాలుగా బతుకమ్మలను పేర్చి నైవేద్యాలను సమర్పిస్తారు.పూలను పూజించే ఏకైక పండుగ మన తెలంగాణలోని బతుకమ్మ పండుగనే అంటూ తెలంగాణ ఆడబిడ్డల అతిపెద్ద వేడుక బతుకమ్మ అని అన్నారు. శ్రీ చైతన్య జూనియర్ కళాశాల చైర్మన్ గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగను మన తెలంగాణలో మాత్రమే అని అన్నారు.ఈ సందర్భంగా వాత్సల్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ దుర్గాప్రసాద్,

అకాడమిక్ ఇంచార్జ్ గొల్లపల్లి సురేష్,రామకృష్ణ వాత్సల్య పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ బి వెంకట్ రెడ్డి,అకాడమిక్ ఇంచార్జ్ గొల్లెపల్లి సురేష్,హెడ్ ఆఫ్ ద డిపార్ట్మెంట్ కక్కెర్ల రామకృష్ణ,గోగురి వెంకటేష్, సరుగు కరుణాకర్, బేతాళ నర్మద, గోధుమల ప్రతిభ, మధిర పరమేశ్వరి, రామాంజనేయులు,కొంక రేఖ, బత్తిని నర్మద,శృతి నాన్ టీచింగ్ స్టాఫ్ స్నాపిక, కావ్య కల్పన, గోపాలకృష్ణ,శంకర్,శ్రీ చైతన్య జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అంబోజు మల్లేష్, డైరెక్టర్ యంపల్ల కొండల్ రెడ్డి,సదానందం,భవిత,శ్రీకాంత్, రాము, శైలేష్ ,మురళీ,రఫీ,శ్రీ లత,పసల బాలరాజ్,చైతన్య, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## టంగుటూరు కురుమ మరియు గొర్ల కాపరి సంఘం నూతన కమిటీ ఎన్నిక....

**సి కే న్యూస్ (సంపత్) అక్టోబర్ 03** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం టంగుటూరు గ్రామంలో 1వ తేది మంగళవారం రోజున మన టంగుటూరు కురుమ మరియు గొర్ల కాపరి సంఘంలినూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది.ఈ కమిటీ కి **గౌరవ అధ్యక్షులు పెద్ద కురుమలు :-**ఇక్కిరి ఉప్పలయ్య,జూకంటి బీరయ్య మరియు కురుమ సంఘం నూతన కమిటీ సభ్యులు అధ్యక్షులు బండి శ్రీనివాసులు,ఉపధ్యక్షులు జన్నె మల్లేష్, ప్రధాన కార్యదర్శి మారుజోడు సిద్దేశ్వర్,కోశాధికారి జూకంటి సత్తయ్య,సహాయ కార్యదర్శి ఇక్కిరీ శ్రీహరి,కార్యవర్గ సభ్యులు ఇక్కిరి మల్లయ్యబండి రమేష్, జూకంటి శ్రీను,కుకట్ల రాజు ఎన్నికయ్యారు.నూతన కమిటీ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు..

## అంతర్జిల్లా పొట్టిలకు యూనివర్సల్ విద్యార్థులు






**తల్లాడ, అక్టోబర్ 3 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్** గత మూడు రోజులు గ ఖమ్మం లో జరిగిన పాఠశాలల జిల్లా స్థాయి క్రీడల పోటీలలో వైరా జోన్ కింద యూనివర్సల్ విద్యాలయం నుండి కబడ్డీ పోటీలు ప్రాతినిధ్యం వహించిన డి హరిదీప్ అంతర్ జిల్లా కబడి పోటీలకు ఎంపిక అయ్యారు.జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో వైరా జోన్ కి మొదటి బహుమతి లభించడంలో హరిదీప్ కీలక పాత్ర పోషించాడు. అలాగే జూనియర్ వాలీబాల్ పోటీల్లో

యూనివర్సల్ విద్యాలయానికి చెందిన ఎన్ అఖిల్ జిల్లా స్థాయిలో వాలీబాల్ పోటీల్లో వైరా జోన్ కి మొదటి బహుమతి లభించడానికి కీలకపాత్ర పోషించాడు. అలాగే అథ్లెటిక్స్ నందు 100 మీటర్స్ విభాగంలో బ్రౌంజు మెడల్ సాధించిన హరిదీప్ తదుపరి జరగబోయే ఇంటర్ డిస్టిక్ కాంపిటీషన్కి సెలక్ట్ అయినందుకు యూనివర్సల్ విద్యాలయం టీ కే ప్రసన్నన్, డైరెక్టర్ మేరీ సోఫియా అభినందించారు. పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపిక కావడం పట్ల చాలా ఆనందంగా మరియు గర్వంగా ఉందని పాఠశాల ఇంచార్జ్ ప్రిన్సిపల్ యాకూబ్, మోహన్, పి ఈ టి నాగేశ్వరరావు తెలియజేశారు. అంతర్ జిల్లా పోటీలకు పాఠశాల విద్యార్థుల ఎంపిక కావటం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

# కొల్లాపూర్ పీజీ ఆంగ్ల అధ్యాపకుడు సురేందర్ కి డాక్టరేట్







- **పీహెచ్డీ పూర్తి చేసిన అభ్యర్థులను అభినందిస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ ఆంగ్ల విభాగం**
- **అభినందించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మార్క్ పాలోనియస్**
- **సంతోషం వ్యక్తం చేస్తున్న డాక్టరేట్ అధ్యాపకుడు సురేందర్**

**కొల్లాపూర్ అక్టోబర్ 3 (సీకే న్యూస్)**
కొల్లాపూర్ పట్టణ కేంద్రంలో ఉన్న పాలమూరు యూనివర్సిటీ పీజీ సెంటర్ కొల్లాపూర్ లో ఆంగ్ల అధ్యాపకుడుగా బోధిస్తున్న సురేందర్ గ్రామీణ మధ్యతరగతి విద్యార్థులు ఆంగ్లాన్ని ఆహ్లాదంగా నేర్చుకోవాలి అనే ఉద్దేశంతో ఉస్మానియా యూనివర్సిటీలో "యూస్ ఆఫ్ రిక్రియేషనల్ మెథడ్స్ ఫర్ ఎఫెక్టింగ్ యాన్ ఆట్టిటూడినల్ చేంజ్ ఇన్ సెకండరీ స్కూల్ లెర్నర్స్ ఆఫ్ వనపర్తి డిస్ట్రిక్ట్ ఏ సైకోలింగ్విస్టిక్ స్టడీ" అనే అంశంతో ప్రొఫెసర్ సావిత్రి పర్యవేక్షణలో ఆంగ్ల విభాగంలో గురువారం డాక్టరేట్ పట్టా పొందారు. ఆంగ్లంలో నెట్ సెట్ అర్హత సాధించి 2017లో పిహెచ్డి సీటు పొందిన సురేందర్ వనపర్తి విద్యార్థులు ఆహ్లాదంగా ఆంగ్లం నేర్చుకోవాలనే సంకల్పంతో ఈ పీహెచ్డీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సురేందర్ ని ఇది సెంటర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మార్క్ పాలోనియస్ అభినందించారు. అనంతరం సురేందర్ మాట్లాడుతూ ఈ పిహెచ్డి నాన్నకు ఆంగ్లభాష అభిమానులకు అంకితం అంటూ చదివినోడే ప్రపంచాన్ని జయిస్తాడు బిడ్డ అన్న నాన్న మాటలు నన్ను పీహెచ్డీ పూర్తి చేసేలా చేసింది. అమ్మానాన్నలు మా చిన్నతనంలో దేశం గుంపులో పనిచేయడానికి వెళ్లి, ఎన్నో కష్టాలు పడి మమ్మల్ని చదివించారని గవర్నమెంట్ హాస్టల్స్ లో అరకొర వసతులతో చదివి, ఆంగ్లంలో మాట్లాడాలి అంటే భయపడే చాలామందిని తేలికగా మాట్లాడేలా చేయాలి అనే సంకల్పంతో ఈ పీహెచ్డి చేశానని ఆయన అన్నారు నా తల్లిదండ్రులకు, నాకు చదువు చెప్పిన గురువులకు మరియు నా పీహెచ్డీ గైడ్ ప్రొఫెసర్ సావిత్రి కి పాదాభివందనం 'అని సురేందర్ తెలిపారు. త్వరలో తన ఒకే ఇంట్లో ముగ్గురు డాక్టరేట్లు ఉంటారని తన అన్నయ్య డాక్టర్ ధర్మరాజు ఆంగ్లంలో పీహెచ్డీ పూర్తి చేయగా, సురేందర్ భార్య సరిత డిగ్రీ లెక్చరర్ కూడా తెలుగులో 'గూడ అంజయ్య జీవితం సాహిత్య పరిశీలన' అనే అంశం లో పీహెచ్డీ చేస్తుండడం విశేషం అంటూ ఆయన సంతోషం వ్యక్తం చేశారు

## తోగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో మైనింగ్ (కోరీలు) అనుమతులు రద్దు చేయాలి

**సేవాలాల్ సేన.**




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),అక్టోబర్ 03,**పాల్వంచ మండలం సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు జర్పుల పరమేష్ నాయక్ ఆధ్వర్యంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు శివనాయక్ ఆధ్వర్యంలో. పాల్వంచ డిప్యూటీ తాసిల్దార్ కి మెమోరణం నమ్మివ్వడం జరిగింది. తూ గూడెం గ్రామ పంచాయతీలో ఏజెన్సీ ఏరియా 1/70 గిరిజన చట్టాలు ఉన్న ప్రాంతంలో విరుద్ధంగా. మైనింగ్ అనుమతులు పొంది మైనింగ్ యాజమాన్యం గిరిజనులకు విరుద్ధంగా పెద్దపెద్ద శబ్దాలు. బాంబు పేలుళ్లు మరియు విపరీతమైన కాలుష్యం. దుమ్ము. దూళి. పెద్దపెద్ద లారీల తో రవాణా ఎప్పుడు రద్దుగా. తో గూడెం ప్రాంతంలో. కార్పొరేట్ వ్యాపారం చేస్తున్నారు. దీనివలన చిన్న పెద్ద తేడా లేకుండా. రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. అంతే కాకుండా మైనింగ్ నడుపుతున్న. భూములు అసైన్మెంట్ ప్రభుత్వ భూములలో మైనింగ్ చేస్తున్నారు. కావున వారి పై విచారించి తగు చర్యలు తీసుకోగలరు. ఈ కార్యక్రమంలో పాల్వంచ సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు. జరుపుల. పరమేష్ నాయక్. జిల్లా అధ్యక్షుడు మాలోత్ శివానాయక్. సేవాలాల్ యువసేన జిల్లా ఉపాధ్యక్షుడు. మాలోత్ ప్రశాంత్ నాయక్. రాష్ట్ర నాయకులు ధరావత్ కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు

## యాదాద్రి, కొండపై ప్రారంభమైన దేవీ నవరాత్రి ఉత్స వాలు



**సికే న్యూస్ యాదగిరిగుట్ట (మధు ) అక్టోబర్ 3**
యాదాద్రిశ్రీ లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలోని అనుబంధ ఆలయములోదసరా శరన్నవరాత్రోత్సవాలకు అంకురార్పణ చేసి ప్రారంభించారు....
ఉత్సవాల్లో భాగంగా స్వర్ణకవచాలంకృత దుర్గాదేవి అలంకారంలో ప్రత్యేక పూజలు చేశారు. తొలుత గణపతి పూజ పుణ్యాహవాచనం, అంకురార్పణ, కలశస్థాపన లో, పంచగవ్య ప్రాశనం, రుత్విగ్వరణముతో మొదలగు పూజలతోనవరాత్రులకు శ్రీకారం చుట్టారు.అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.రెండవ రోజు ఆలయంలో త్రిపుర సుందరిగా అలంకరిస్తారు. మూడోరోజు గాయత్రి దేవి, నాలుగవ రోజు అన్నపూర్ణ దేవి, ఐదోరోజు లలిత త్రిపుర సుందరి దేవి, ఆరోజు మహాలక్ష్మి ఏడవ రోజు సరస్వతి దేవి, మూలా నక్షత్రం, ఎనిమిదో రోజు దుర్గాదేవి దుర్గాష్టమి, తొమ్మిదవరోజు మహిషాసుర మర్ధిని, (మహర్నవమి) పదో రోజు దసరాను పురస్కరించుకొని, రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని ఆలయ అర్చకులు పేర్కొన్నారు...
ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ భాస్కర్ రావు ,ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహ మూర్తి ఆలయ అధికారులుపాల్గొన్నారు.

## కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయానికి 54 వేల రూపాయల వెండి వస్తువు బహుకరించిన



**మన్నెం కరుణాకర్ రెడ్డి ఉమారాణి దంపతులు**

**సికె న్యూస్ సూర్యాపేట జిల్లా ప్రతినిధి రామయ్య అక్టోబర్ 03:**మఠంపల్లి మండల కేంద్రంలోని వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయానికి దసర శరన్నవరాత్రులు, ఉత్సవాల సందర్బంగా మన్నెం.ఆదేమ్మ వారి ఆణువంశిక వారసుడు మన్నెం. కరుణాకర్ రెడ్డి, ఉమారాణి దంపతులు గురువారం 54, 500/-రూపాయల విలువ గల వెండి ఉత్తరిణి,తీర్థపు గిన్నెను ఆలయ అర్చకులు శ్రీ సోమయాజుల. సూర్యనారాయణ మూర్తికి అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో దేవాలయ కమిటీ పెద్దలు బంధువులు భక్తులు పాల్గొన్నారు.

## ఈదురుగాలులు.. వర్ష బీభత్సం... విరిగిన చెట్లు...స్తంభాలు



**పెబ్బేరు అక్టోబర్03 (సి కే న్యూస్)**పెబ్బేరు మండలంలో ఓ వైపు ఎండలు మండుతుండగా గురువారం సాయంత్రం నుంచి రాత్రి ఈదురు గాలులు, ఉరుములతో భారీ వర్షం కురిసింది. వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలో సాయంత్రం 5గంటల నుంచి వర్షం మొదలైంది. ఉరుములు, మెరుపులతో మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు, చెట్లు నెలకొరిగాయి. పెబ్బేరు పట్టణ కేంద్రంలో కర్నూలు వెళ్లే రహదారిపై ఈదురుగాలులకు చెట్లు విరిగిపడ్డాయి. దీంతో కాసేపు వాహనదారుల రాకపోకలు ఆగిపోయాయి. మున్సిపాలిటీ కేంద్రంలో కరెంటు స్తంభాలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.వివిధ గ్రామాల్లో గురువారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములతో భారీ వర్షం పడటంతో విద్యుత్ తీగలు తెగిపోవడంతో విద్యుత్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## జిల్లా పౌర సంబంధాల అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అరుంధతి...



**సి కే న్యూస్ (సంపత్) అక్టోబర్ 03:**యాదాద్రి భువనగిరి జిల్లా లో జిల్లా పౌర సంబంధాల అధికారిగా యూ.అరుంధతి గురువారం రోజున బాధ్యతలు స్వీకరించినారు..యాదాద్రి భువనగిరి జిల్లా పౌర సంబంధాల అధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించి మర్యాద పూర్వకంగా జిల్లా కలెక్టర్ ను కలిశారు. ప్రస్తుతం యాదాద్రి భువనగిరి జిల్లా లో జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో అడిషనల్ పౌర సంబంధాల అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు.గతంలో వీరు హైదరాబాద్,మేడ్చల్ మల్కాగిరి జిల్లాలో అదనపు పౌర సంబంధాల అధికారిగా విధులు నిర్వహించారు.

## ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు....



**పెబ్బేరు అక్టోబర్03 (సి కే న్యూస్)**వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలో శరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా పెబ్బేరులో భవాని సేన యూత్ సభ్యులు, శ్రీ తోగుట వీర క్షేత్రియ సంఘం సభ్యులు,శ్రీ వాసవి మాత ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం నుంచి కలశాలతో, బతుకమ్మలతో, భజన కీర్తనలతో అమ్మవారిని పురువీడుదుల గుండా ఊరేగిస్తూ స్థానిక సుభాష్ చౌరస్తా వద్ద నుంచి "భవాని సేన" సభ్యులు ఏర్పాటు చేసిన చిన్న చౌడేశ్వరి దేవి ఆలయంలోకి విగ్రహాన్ని నిలబెట్టారు. తోగుట వీర క్షత్రియులు ఏర్పాటుచేసిన విగ్రహ ఊరేగింపు, కలషాలతో శ్రీ తోగుట చౌడేశ్వరి దేవి ఆలయం వరకు శోభయాత్ర గా ఈ కార్యక్రమం ముగిసింది. అనంతరం శ్రీ వాసవి మాత ఆలయ కమిటీ సభ్యులు బతుకమ్మలతో, కలశాలతో అంగరంగ వైభవంగా శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయం నుంచి బతుకమ్మలను ఆడుతూ, శ్రీ వాసవి మాత ఆలయం వరకు శోభయాత్ర చేశారు.ఈ కార్యక్రమంలో పెబ్బేర్ వివిధ ఆలయాల కమిటీ సభ్యులు, హిందూ జాగృతం సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# విజయవంతంగా ముగిసిన భట్టి విక్రమార్క మల్లు అమెరికా, జపాన్ పర్యటన.

**ఆధునిక గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి పద్ధతులు, బొగ్గు ఉత్పత్తిలో భద్రత, ఆధునిక సాంకేతికతలు పరిశీలన, రాష్ట్రంలో అమలుకు యోచన.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),అక్టోబర్ 03,**గత నెల 24న ప్రారంభమైన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మరియు ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు అమెరికా, జపాన్ దేశాల అధికారిక పర్యటన గురువారం తో విజయవంతంగా ముగిసింది. ఈ పర్యటనలో ఆయనతో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి పి.రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సిఎండీ ఎన్.బలరామ్ పాల్గొన్నారు.

ఈ పర్యటనలో ప్రధానంగా అంతర్జాతీయంగా ఉనికిలోకి వచ్చిన అత్యాధునిక గ్రీన్ ఎనర్జీ టెక్నాలజీలు, ఆధునిక మైనింగ్ విధానంలో అధికోత్పత్తిని సాధించే భారీ యంత్రాలు, వర్చువల్ రియాలిటీతో రక్షణ చర్యలు మొదలైనవి స్వయంగా పరిశీలించడమే కాక వీటిని రాష్ట్రంలో అమలు జరపడానికి శ్రీకారం చుట్టారు. అమెరికాలో జరిగిన అంతర్జాతీయ మైనింగ్ ఎగ్జిబిషన్ మైనెక్స్- 2024లో కోమత్సు, హిట్యాచి, క్యాటర్ పిల్లర్ వంటి ప్రముఖ కంపెనీలు ఉత్పత్తి చేసిన అత్యాధునిక షావెల్స్, డంపర్లు, కంటిన్యూయస్ మైనర్ యంత్రాలు, గనిలో ప్రమాదాలు జరగకుండా చూసే రక్షణ వ్యవస్థలను పరిశీలించారు. ముఖ్యంగా భూగర్భ గనుల్లో వర్చువల్ రియాలిటీ ద్వారా గని వెలుపలే ఉండి లోపల బొగ్గును తవ్వే సాంకేతికత ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

సింగరేణి సంస్థ ఈ తరహా అత్యధిక బొగ్గు ఉత్పత్తిని సాధించే ఆధునిక యంత్రాలను సమకూర్చుకోవాలని, ప్రమాదరహిత సింగరేణిగా సంస్థను రూపుదిద్దడానికి ఆధునిక రక్షణ సాంకేతికతను అమలు చేయాలని భట్టి విక్రమార్క మల్లు ఈ సందర్భంగా సింగరేణి సిఎండీ ఎన్.బలరామ్ ను కోరారు. అమెరికాలో అతిపెద్ద హూవర్ జల విద్యుత్ డ్యామ్ ను సందర్శించిన సందర్భంగా అక్కడ అమలవుతున్న జల విద్యుత్ ఉత్పత్తి విధానాలు, రక్షణ చర్యలు తెలంగాణలో కూడా అమలు జరపాలని ఆయన ఎనర్జీ కార్యదర్శి రోనాల్డ్ రోస్ ను కోరారు. జపాన్ పర్యటనలో యమనాషీ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ కేంద్రంలో గ్రీన్ హైడ్రోజన్ ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయడానికి వినియోగించే సాంకేతికతను, సోలార్ విద్యుత్తును నిలువ ఉంచే ఫ్యూయల్ సెల్స్ టెక్నాలజీని పరిశీలించారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున సోలార్ విద్యుత్తు ఉత్పత్తి చేపట్టనున్న నేపథ్యంలో ఈ రెండు పద్ధతులపై దృష్టి సారించాలని, తెలంగాణ లో గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీ వృద్ధికి యమనాషీ సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. అలాగే తోషిబా పరిశ్రమలను సందర్శించి అక్కడ ఉత్పత్తి అవుతున్న అత్యాధునిక ఫోటో వోల్టాయిక్ మాడ్యూల్స్ తయారీ టెక్నాలజీని పరిశీలించారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఫోటో వోల్టాయిక్ మాడ్యూల్స్ అవసరం ఎంతో ఉంటుందని, అలాగే అన్ని ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులు గా మార్చే ఉద్దేశం ఉన్నందున ఫ్యూయల్ సెల్స్ ఆవశ్యకత కూడా ఉంటుందని భట్టి పేర్కొన్నారు. తోషిబా వారిని రాష్ట్రంలో ఉమ్మడి భాగస్వామ్యంతో కానీ, స్వయంగా గానీ ఫ్యూయల్ సెల్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. అలాగే రోహ్మ్ సెమీకండక్టర్ల పరిశ్రమను సందర్శించి అక్కడ జరుగుతున్న పలు రకాల సెమీకండక్టర్ లు, హై ఎఫిషియన్సీ బ్యాటరీలు, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ సెమీకండక్టర్లు వంటివి పరిశీలించారు. సోలార్ విద్యుత్ కు ఇతర ఆధునిక పరిశ్రమలకు ఈ అత్యాధునిక సెమీకండక్టర్ల ఆవశ్యకత ఉన్నందున ఈ తరహా పరిశ్రమను తెలంగాణ రాష్ట్రంలో చేయాలని వారిని ఆహ్వానించారు. అలాగే పానాసోనిక్ కంపెనీ వారితో కూడా ఆధునిక ఎలక్ట్రిక్ మరియు ఎలక్ట్రానిక్ పరికరాల పై చర్చించారు. జపాన్ రవాణా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న బుల్లెట్ ట్రైన్ లో ఆయన స్వయంగా ప్రయాణించారు. అత్యంత వేగంతో ప్రయాణించే ఈ తరహా ట్రైన్ లను రాష్ట్రంలో కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని రైల్వే శాఖకు విజ్ఞప్తి చేస్తున్నట్టు పేర్కొన్నారు. మొత్తం మీద రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఆయనతో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారుల బృందం జరిపిన పర్యటన రాష్ట్ర విద్యుత్ రంగంలో అత్యాధునిక గ్రీన్ ఎనర్జీ ఉత్పాదనకు, సింగరేణిలో రక్షణతో కూడిన అధికోత్పత్తి మైనింగ్ పద్ధతుల ఆచరణకు ఊతం ఇవ్వనుంది.

# ఎస్సీ కాలనీలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



- విగ్రహ దాత వస్కుల నర్సయ్య చంద్రకళ దంపతులు
- దుర్గాదేవి దీవెనలు గ్రామ ప్రజలపై ఉండాలి
- వస్కుల నరసయ్య
- దుర్గా దేవికి ఘనంగా అలకరణ

**సికె న్యూస్ సూర్యాపేట జిల్లా ప్రతినిధి రామయ్య అక్టోబర్ 03:** సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలోని రాజీవ్ నగర్ ఎస్సీ కాలనీలో దేవీ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గాదేవి విగ్రహం పట్టు వస్త్రాలు దాతగా వస్కుకుల నరసయ్య చంద్రకళ దంపతులు కాలనీవాసుల నడుమ దుర్గా దేవి అమ్మవారి విగ్రహాన్ని ఎర్పాటు చేసి ఘనంగా అలంకరించారు.అమ్మవారి రూపం అయినటువంటి విగ్రహం ఏర్పాటు భక్తితో పూజలు చేయడం జరిగింది ఈరోజు మొదటి రోజు కాబట్టి అమ్మవారిని త్రిపుర బాల సుందరి దేవి గా కలవడం జరుగుతుంది శ్రీచక్రంలోని త్రిపురాత్రయంలో మొదటి దేవత.షోడశ విద్యకు ఈ దేవత అధిష్ఠాన దేవత కాబట్టి ఉపాసకులు త్రిపుర సుందరి దేవి అనుగ్రహం కోసం బాలర్చన చేస్తారు.అసలు బాల త్రిపుర అనే పేరే పరమ పవిత్రమైన పేరు.త్రిపురుని భార్య అంటే ఈశ్వరుడి భార్య అయిన గౌరి దేవి అని అర్ధం. మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం బాల త్రిపుర సుందరిదేవి ఆధీనంలో ఉంటాయి.అభయ హస్త ముద్రతో, అక్షరమాల ధరించిన ఈ తల్లిని ఆరాధిస్తే మానసిక బాధలు తొలగిపోతాయి.నిత్య సంతోషం కలుగుతుంది.ఈ తల్లి త్రిపుర సుందరి దేవి అయ్య వారు ఎమో త్రిపురాంతకుడు ఆది దంపతులు వారి తత్వము కుడా అటువంటిదని త్రిపుర సుందరి అంటే మనలోని మూడు అవస్తలు జాగృత్, స్వప్న , సుషుప్తి. ఈమూడు అవస్థలు లేదా పురములకు బాల అధిష్ఠాన దేవత.త్రిపురుని భార్య అంటే ఈశ్వరుడి భార్య అయిన గౌరి దేవి అని అర్ధం. మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం బాల త్రిపుర సుందరిదేవి ఆధీనంలో ఉంటాయి. అభయ హస్త ముద్రతో, అక్షరమాల ధరించిన ఈ తల్లిని ఆరాధిస్తే మానసిక బాధలు తొలగిపోతాయి. నిత్య సంతోషం కలుగుతుందని
త్రిపుర సుందరి దేవి శ్రీచక్రంలోని త్రిపురాత్రయంలో మొదటి దేవత.షోడశ విద్యకు ఈ దేవత అధిష్ఠాన దేవత కాబట్టి ఉపాసకులు త్రిపుర సుందరి దేవి అనుగ్రహం కోసం బాలర్చన చేస్తారు.అసలు బాల త్రిపుర అనే పేరే పరమ పవిత్రమైన పేరు.ఈ తల్లి త్రిపుర సుందరి దేవి అయ్య వారు ఎమో త్రిపురాంతకుడు ఆది దంపతులు వారి తత్వము కుడా అటువంటిది. త్రిపుర సుందరి అంటే మనలోని మూడు అవస్తలు జాగృత్, స్వప్న , సుషుప్తి. ఈమూడు అవస్థలు లేదా పురములకు బాల అధిష్ఠాన జగత్తు అంతటిని అనుభవింపచేస్తూ బాలగా అమ్మవారు సంతోషిస్తుంది.
మనము ఎన్ని జన్మలు ఎత్తిన ఈ ముడు అవస్థలలోనే తిరుగుతూ ఉంటాము. కేవలం ఉపాధులు మాత్రమే మారుతాయి.అటువంటి తల్లి ఈ రూపములో మనలోనే ఉంది.ఆవిడ ఆత్మ స్వరూపురాలు ఆవిడను పూజిస్తే జ్ఞానము కలిగి తానే శివ స్వరూపముతో చైతన్యము ప్రసాదించి మోక్షమునకు అనగా పరబ్రహ్మతత్వం వైపు నడిపిస్తుందని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. విగ్రహ దాత వస్కుల నరసయ్య మాట్లాడుతూ కనకదుర్గమ్మ అమ్మవారి చలవతో గ్రామం గ్రామంలోని ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆ తల్లి దీవెనలు ప్రతి ఒక్క కుటుంబం పై ఉండాలని గ్రామంలో పాడి పంటలు సమృద్ధిగా పండాలని గ్రామ ప్రజలు ఎటువంటి రోగాల బారిన పడకుండా తల్లి కాపాడాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో నిర్వాహకులు కాంపాటి సందీప్ ఆరాల వీరస్వామి కొమ్ము ఇమ్మానుయేలు ఆరాల అంజి ఆరాల సైదులు కాటిపల్లి మల్లేష్ కొమ్ముకోటి రాజేష్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు 2500 మహాలక్ష్మి పథకాన్ని వెంటనే అమలు చేయాలి



**బట్టుపల్లి అనురాధ..ఐద్వా జిల్లా కార్యదర్శి**

**సి కే న్యూస్ (సంపత్) అక్టోబర్ 03:**గురువారం రోజున ఆలేరు మున్సిపల్ పట్టణ ఐద్వా (అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం)మహాసభ కాటమయ్య నగర్ లో జరిగింది.ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ మాట్లాడుతూ..గత శాసనసభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మహిళలకు 2500 మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చిందని ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటివరకు తాము ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని వెంటనే మహిళలకు నెలకి 2500 మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు అదేవిధంగా మహిళలకు 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ సైతం పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదని కొంతమందికి ఇచ్చి మిగతా వారికి మొండిచేయి చూపిస్తున్నారని అర్హులైన పేదలందరికీ గ్యాస్ బండను 500 రూపాయలకు అందించాలని,పట్టణంలో వందలాది మంది మహిళలు బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని,బీడీ కార్మికుల ఎలాంటి షరతులు లేకుండా జీవన భృతి ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు..మహిళలు తమ బస్తీలలో ఉన్న సమస్యలపై అవగాహనతో చైతన్యంతో సమస్యల సాధన కోసం పోరాటాల్లో ముందుకు రావాలని అప్పుడే స్థానికంగా ఉన్న సమస్యలు పరిష్కారం అవుతాయని పురుషులతో సమానంగా మహిళలు ఆర్థిక సామాజిక రంగాల్లో ముందుండాలి అప్పుడే దేశం అభివృద్ధి వైపుకు పయనిస్తుందని మహిళలు తమ చుట్టూ ఉన్న వివక్షత అసమానతలపై తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఆరుట్ల కమలాదేవి స్ఫూర్తితో ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని ఆమె సందర్భంగా పిలుపునిచ్చారు అనంతరం ఐద్వా పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు.కమిటీ అధ్యక్షురాలుగా రాజబోన భాగ్య ప్రధాన కార్యదర్శిగా అయిలి చంద్రకళ ఉపాధ్యక్షురాలుగా మోరిగాడి స్వరూప సహాయ కార్యదర్శిగా అంగిరేకుల భాగ్య కోశాధికారిగా మోరిగాడి మంజుల కమిటీ సభ్యులుగా గణగాని భాగ్య అయిలి అంజమ్మ దిండి స్వరూప ఎలగందుల పద్మ రచ్చ వజ్రమ్మ మెరుగు నర్సమ్మ లక్ష్మి బండ్ల లక్ష్మి నూతన కమిటీని ఎన్నుకున్నారు.

# హుజుర్నగర్ కు పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐ.టి.ఐ) మంజూరు

**భవన నిర్మాణానికి 14.35 కోట్ల నిధులు విడుదల**

**ఐదు కోర్సులలో 216మందికి అవకాశం**

**ప్రిన్సిపాల్ తో సహా 8 పోస్టుల మంజూరి**






**సికె న్యూస్ సూర్యాపేట జిల్లా ప్రతినిధి రామయ్య అక్టోబర్ 03:**హుజుర్నగర్ నియోజకవర్గ అభివృద్ధి పై మరోమారు మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అభివృద్ధి మార్క్ పడింది. ఎంతో కాలం నుండి డిమాండ్ లో ఉన్న పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐ.టి.ఐ) ని మంజూరు చేయించడంతో పాటు శాశ్వత భవన నిర్మాణానికి గాను స్థానిక శాసనసభ్యులు రాష్ట్ర నీటిపారుదల మరియు పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి 14.35 కోట్లు నిధులను విడుదల చేయించారు.ఇందులో ట్రెడ్స్
ఎలక్ట్రిషియన్,ఫిట్టర్,డ్రాఫ్ట్స్ మెన్, డీజిల్ మెకానిక్ లతో పాటు వెల్డర్ కోర్సులలో శిక్షణ నిమిత్తం ప్రారంభిస్తున్న ఈ నూతన ఐటిఐతో ఈ ప్రాంత నిరుద్యోగులకు ప్రయోజనకారిగా మారనుంది.
మొత్తం ఐదు కోర్సులలో 216 విద్యార్థులతో ప్రారంభం కానున్న ఈ ఐ టి ఐ కి ప్రిన్సిపాల్ తో సహా 8 పోస్టులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఒప్పించి మంజూరు చేయించారు.
గతంలో తాను మంజూరు చేయించిన అడ్వాన్డ్ ట్రైనింగ్ సెంటర్ సమీపంలో రామస్వామి గుట్ట వద్ద కొత్తగా మంజూరు అయిన పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐ. టి.ఐ)నీ నెలకొల్పనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## యాదగిరిగుట్ట మండలం పెద్ద కందుకూరు గ్రామంలో ఖల్లె సత్తమ్మ అనారోగ్యంతో మృతిచెందగా.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వవిప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల ఐలయ్య

వారి మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



**సికే న్యూస్ యదగిరిగుట్ట అక్టోబర్ 3:**యాదగిరిగుట్ట మండలం తాళ్ల గూడెం గ్రామంలో కసావు కిష్టయ్య అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహానికి.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల ఐలయ్య నివాళులర్పించారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.
అదే తాళ్లగూడెం గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కసావు రాజయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని ధైర్యం నింపిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల ఐలయ్య

## ఎన్జీవోస్ కాలనీలో ఘనంగా దేవి శరన్నవరాత్రులు





**సికె న్యూస్ సూర్యాపేట జిల్లా ప్రతినిధి రామయ్య అక్టోబర్ 03:** హుజూర్నగర్ పట్టణంలోని మూడో వార్డ్ ఎన్జీవోస్ కాలనీ లో దుర్గాదేవి పండుగకు అంగరంగ వైభవంగా ఏర్పాట్లు కమిటీ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు.
బాలా త్రిపుర సుందరి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు
అమ్మ వారి కి వస్త్రాలను మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్ రెడ్డి దంపతులు సమర్పించారు. ఇట్టి కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు .

## యాదగిరిగుట్ట.దుర్గామాత మండపంలో ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు



**సి కే న్యూస్ యదగిరిగుట్ట (మధు ) అక్టోబర్ 3:**యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో ‘ ఏర్పాటు చేసిన దుర్గామాత మండపంలో ఆలేరు ఎమ్మెల్యే దంపతులు బీర్ల ఐలయ్య అనిత. ప్రత్యేక పూజలు నిర్యహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు.కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రకాంత్ CK NEWS తెలుగు దినపత్రిక

# జేసీబీ రైతు పెట్టిన కంపెనీ

సాధారణంగా కొన్ని వస్తువులను వాటిని తయారుచేసిన వ్యక్తుల పేర్లతోనే పిలుస్తుంటారు. లేదంటే.. ఆ వస్తువుని మొదటగా మార్కెట్‌లోకి తెచ్చిన కంపెనీ పేరుతో పిలుస్తుంటారు. జిరాక్స్, జీప్, డంప్‌స్టర్, డాల్డా అలా వచ్చినవే. అలాగే కొన్నేండ్ల క్రితం బుల్డోజర్లు(ఎక్స్‌కవేటర్లు) మార్కెట్‌లోకి వచ్చినప్పుడు దాన్ని తెచ్చిన కంపెనీ, తయారుచేసిన వ్యక్తి జేసీబీ(జోసెఫ్ సిరిల్ బామ్‌ఫోర్డ్) పేరుతోనే పిలవడం మొదలైంది. ఏండ్లు గడిచినా, కొత్త టెక్నాలజీలు వచ్చినా జేసీబీకి ఉన్న క్రేజ్ మాత్రం తగ్గడం లేదు. నిర్మాణరంగంలో ప్రపంచంవ్యాప్తంగా గొప్ప విప్లవం తెచ్చిన జోసెఫ్ సిరిల్ బామ్‌ఫోర్డ్ పేరులోని మొదటి అక్షరాలతో జేసీబీ కంపెనీకి ఆ పేరుపెట్టారు. జేసీబీ స్టోరీ రెండో ప్రపంచ యుద్ధం తర్వాత మొదలైంది. జోసెఫ్‌ది ఇంగ్లాండ్‌లోని ఉటోక్సెటర్. అతను యువరైతు. వ్యవసాయం చేస్తున్నప్పుడు అతనికి మరింత ఎఫెక్టివ్‌గా పనిచేసే పరికరాలు అవసరం అనిపించింది. అందుకే అతనికి వ్యవసాయంలో తలెత్తిన ప్రతి సమస్యకు పరిష్కారాన్ని కనుక్కోవాలని అనుకున్నాడు. అందులో భాగంగానే తన పొలంలో ఒక చిన్న వర్క్‌షాప్ ఏర్పాటు చేసుకున్నాడు. అందులోనే తనకు కావాల్సిన పరికరాలు తయారుచేసుకునేవాడు. 1945లో యుద్ధం ముగిశాక తన గ్యారేజీలో వ్యవసాయ టిప్పింగ్ ట్రైలర్‌లను డెవలప్ చేయడం మొదలుపెట్టాడు. అందుకోసం రెండో ప్రపంచ యుద్ధం నాటి స్క్రాప్‌ని వాడుకున్నాడు. అలా తయారుచేసిన మొదటి టిప్పింగ్ ట్రైలర్‌ను అదే టౌన్‌లో ఉన్న మార్కెట్‌లో 45 డాలర్లకు అమ్మాడు. ఆ తర్వాత వారం రోజుల్లో మరో ట్రైలర్ రెడీ చేశాడు. దాన్ని కూడా 45 డాలర్లకు అమ్మాడు. దాంతో అలాంటి ట్రైలర్లకు డిమాండ్ ఉందనే విషయం అర్థమైంది. దాంతో భారీగా ప్రొడక్షన్ మొదలుపెట్టాడు. అప్పటినుంచి వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు అతనికి. 1947 నాటికి కంపెనీ తయారుచేసే అన్ని వస్తువులకు మంచి పేరొచ్చింది. క్వాలిటీకి మారుపేరుగా నిలిచాయి. దాంతో కంపెనీ ఫుల్‌టైం ఉద్యోగులను రిక్రూట్ చేసుకుంది. ఆ తర్వాత1949లో 'జేసీబీ మేజర్ లోడర్' పేరుతో ఒక లోడర్‌ని తీసుకొచ్చింది. ఇది వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ఈ లోడర్ ఇచ్చిన సక్సెస్‌తో 'ఎంకే 1' పేరుతో ఎక్స్‌కవేటర్‌ని తీసుకొచ్చింది. ఇప్పుడు మనం చూస్తున్న ఎక్స్‌కవేటర్లకు కూడా ఇదే ఇన్‌స్పిరేషన్.

### మొదటి కంపెనీ

ప్రపంచ యుద్ధం తర్వాత వచ్చి బాగా డెవలప్ అయిన కంపెనీల లిస్ట్‌లో జేసీబీ మొదటి వరుసలో ఉంది. యుద్ధం వల్ల కలిగిన నష్టాల నుంచి కోలుకుంటున్న ఇంగ్లాండ్ అగ్రికల్చర్ మార్కెట్‌ను జేసీబీ స్వాధీనం చేసుకుంది. 1948 నుంచి తీసుకొచ్చిన 'హైడ్రాలిక్స్' వల్ల కంపెనీకి బాగా పేరొచ్చింది. యూరప్‌లో హైడ్రాలిక్ లోడర్‌ను తీసుకొచ్చిన మొదటి కంపెనీ ఇది. ఈ లోడర్‌కి రకరకాల అటాచ్‌మెంట్స్ చేసుకునేలా తయారుచేశారు. అందుకే అంతలా సక్సెస్ అయ్యింది. అంతేకాదు.. జేసీబీ ఎంకే1లో హైడ్రాలిక్ రియర్ ఎక్స్‌కవేటర్, ముందు మౌంటెడ్ లేయర్ ఉన్నాయి. ఇలా రెండు పనులు చేసే ఒకే మెషిన్‌ని తయారుచేయడం అదే మొదటిసారి. దాంతో వాటికి బాగా గిరాకీ పెరిగింది. అప్పుడే ఎక్స్‌పోర్ట్స్ కూడా మొదలుపెట్టడడంతో జేసీబీ 'లోగో'– ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. –

### మ్యాన్ పవర్ తగ్గింది

జేసీబీ తీసుకొచ్చిన బ్యాక్‌హో వల్ల1960ల నాటికి వ్యవసాయ, నిర్మాణ రంగాల్లో కార్మికుల సంఖ్య తగ్గింది. చాలా పనులకు జేసీబీలను వాడడం మొదలైంది. ఆ సక్సెస్‌తో కంపెనీని విస్తరించారు. వాస్తవానికి అందరూ జేసీబీ కేవలం నిర్మాణ, వ్యవసాయ రంగ ఉత్పత్తులు మాత్రమే తయారుచేస్తుంది అనుకుంటారు. కానీ.. ఈ కంపెనీ 1961లోనే ఏవియేషన్ రంగంలోకి కూడా అడుగుపెట్టింది. కంపెనీ మొట్టమొదటి విమానం ట్విన్ ఇంజిన్ 'డి హావిలాండ్ డోవ్'ని తీసుకొచ్చింది. ఇప్పుడున్న ఎన్నో ఏవియేషన్ కంపెనీల కంటే జేసీబీ చాలా పాత కంపెనీ. ఈ కంపెనీ విమానరంగంలో కూడా సక్సెస్ కావడంతో 1962లో మొదటిసారిగా హాలాండ్ దేశంలో అమ్మకాలు మొదలుపెట్టింది. 1964లో అమ్మకాలు విపరీతంగా పెరిగాయి. అప్పుడే కంపెనీ మొదటిసారిగా అమెరికాకు ఎగుమతి చేయడం మొదలుపెట్టింది. 1969లో జేసీబీ రికార్డు స్థాయిలో 4,500 మెషిన్లను ఉత్పత్తి చేసింది. వాటిలో సగానికి పైగా ఎగుమతి చేసింది. 1971 %–%1973 మధ్య టర్నోవర్ రెండింతలు పెరిగింది. ఆ తర్వాత 1979లో ఇండియాలో తయారీని ప్లాంట్ స్టార్ట్ చేసింది. ప్రస్తుతం జేసీబీకి న్యూ ఢిల్లీ, పూనే, జైపూర్‌లలో ఫ్యాక్టరీలు ఉన్నాయి. యూకే తర్వాత జేసీబీకి అతిపెద్ద మార్కెట్ ఇప్పటికీ ఇండియాలోనే ఉంది.

### కొత్త రంగాల్లోకి...

1990 నాటికి జేసీబీ ఫాస్ట్‌ట్రాక్ ట్రాక్టర్‌ను ప్రారంభించడంతో మరో కొత్త రంగంలోకి ప్రవేశించింది. ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి హై–స్పీడ్, ఫుల్ సస్పెన్షన్ ట్రాక్టర్. దీన్ని డెవలప్ చేయడానికి కంపెనీ 12 మిలియన్ల డాలర్లు ఖర్చు చేసింది. అప్పట్లో దీని సేల్స్ చాలా బాగా జరిగాయి. ఇలా కంపెనీ సక్సెస్‌కి ఎన్నో రకాలుగా కారణమైన జోసెఫ్ సిరిల్ బామ్‌ఫోర్డ్ 2001 మార్చి1న చనిపోయాడు. అప్పటినుంచి కంపెనీని అతని వారసులే నడుపుతున్నారు.

### సక్సెస్‌కు కేరాఫ్

ఒక చిన్న షెడ్డులో వ్యవసాయ టిప్పింగ్ ట్రైలర్‌ల తయారీతో మొదలైన కంపెనీ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాలకు ఎగుమతులు చేస్తోంది. కంపెనీకి నాలుగు ఖండాల్లో 22 ప్లాంట్లు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా డీలర్లు ఉన్నారు. దాదాపు 50 ఏండ్లుగా వరల్డ్ ఫేమస్ బ్రాండ్‌గా ఉంది. ముఖ్యంగా ఇండియాతో కంపెనీకి మంచి అనుబంధం ఉంది. నాలుగు దశాబ్దాల క్రితం భారతదేశంలోకి అడుగుపెట్టిన కంపెనీ 'బ్యాక్‌హో, లోడర్ల'ను పరిచయం చేసింది. కంపెనీకి ప్రపంచంలోనే అతిపెద్ద ఫ్యాక్టరీ మనదేశంలో ఉంది. ప్రస్తుతం కంపెనీ ట్రాక్డ్ ఎక్స్‌కవేటర్లు, వీల్డ్ లోడర్లు, స్కిడ్ స్టీర్ లోడర్‌లు, టెలిహ్యాండ్లర్‌లు, డీజిల్ జనరేటర్లు, డీజిల్ ఇంజన్ మెషిన్లు తయారుచేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా150 దేశాల్లో అమ్మకాలు చేస్తోంది.

### సక్సెస్‌కు కారణాలివి...

కంపెనీ ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఇన్నొవేషన్‌లకు ప్రాధాన్యం ఇస్తుంది. జోసెఫ్ మొదటి నుండి పరికరాలను తయారుచేయడంలో కొత్త, మెరుగైన మార్గాలను వెతికేవాడు. అందుకే తక్కువ ఖర్చుతో క్వాలిటీ పరికరాలను తయారుచేయగలిగేవాళ్లు. కంపెనీ ఇప్పటికీ ఆ స్ఫూర్తితోనే నడుస్తోంది. అంతేకాకుండా కంపెనీ తన ప్రొడక్ట్స్‌ని ఇంకా బెటర్ చేయడానికి ఎప్పుడూ కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుంటుంది. ఉదాహరణకు.. ఫ్యుయెల్ వాడకం తగ్గించేందుకు ఈ మధ్య హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వెహికల్స్‌ని కూడా డెవలప్ చేసింది ఈ కంపెనీ.

సేఫ్టీ విషయంలో జేసీబీ చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. ఈ కంపెనీ ప్రొడక్ట్స్ ఉపయోగించే వాళ్ల సేఫ్టీ కోసం కొత్త మార్గాలను కనుగొనడానికి చాలా ఖర్చు చేస్తుంది. ఉదాహరణకు.. నిర్మాణ ప్రదేశాల్లో జరిగే యాక్సిడెంట్స్ తగ్గించడానికి ఆటోమేటిక్ బ్రేకింగ్ సిస్టమ్స్ డెవలప్ చేసింది. అంతేకాదు.. కంపెనీ వెహికల్స్ సరిగ్గా ఆపరేట్ చేసేందుకు కస్టమర్లకు ట్రైనింగ్, సపోర్ట్ కూడా ఇస్తోంది. కంపెనీ తీసుకొచ్చిన ప్రొడక్ట్స్ సక్సెస్ అయ్యాయని అంతటితో ఆగలేదు. పోర్ట్‌ఫోలియో డైవర్సిటీని పాటించింది. వెహికల్స్ తయారీతోపాటు పవర్ సొల్యూషన్స్, వ్యవసాయ పరికరాలు, రీసైక్లింగ్ టూల్స్.. ఇలా అనేక రకాల ప్రొడక్ట్స్ మీద ఇన్వెస్ట్ చేసింది. ఈ డైవర్సిఫికేషన్ కంపెనీ కొత్త మార్కెట్లలోకి అడుగులు వేసేలా చేసింది. దాంతో ఆదాయ మార్గాలు పెరిగాయి. వెహికల్స్ తయారీలో కార్మికులు ఇబ్బంది పడకుండా, ప్రొడక్షన్ వేగంగా జరిగేలా ఎప్పటికప్పుడు సౌకర్యాలు కల్పిస్తుంటుంది. ప్రపంచవ్యాప్తంగా అత్యాధునిక మాన్యుఫాక్చరింగ్ సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చింది. ఉదాహరణకు, యూకేలోని స్టాన్‌ఫోర్డ్‌షైర్‌లోని జేసీబీ ఫ్యాక్టరీలో త్రీడీ ప్రింటింగ్, రోబోటిక్స్ లాంటి ఆధునిక పద్ధతులను ఉపయోగిస్తున్నారు. క్వాలిటీ విషయంలో కంపెనీ ఎప్పుడూ రాజీపడలేదు. కఠినమైన క్వాలిటీ కంట్రోల్ విధానాలను పాటిస్తుంది. జేసీబీ ప్రొడక్ట్స్ ఛాలెంజింగ్ కండిషన్స్‌ని కూడా తట్టుకుని పనిచేస్తాయి. సేవలో కూడా ముందే. ఈ సంస్థ అనేక స్వచ్ఛంద కార్యక్రమాల్లో పాల్గొంటుంది. ఉదాహరణకు.. జేసీబీ కంపెనీ ఉన్న దేశాల్లో స్కూల్స్, హెల్త్ క్లినిక్స్ కట్టించింది. ఎన్విరాన్‌మెంట్ సేఫ్టీ కార్యక్రమాలను కూడా మొదలుపెట్టింది.

### ఇన్నొవేషన్ మైల్‌స్టోన్స్

1949: జేసీబీ మేజర్ లోడర్ వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. 1952: ఎంకే1 ఎక్స్‌కవేటర్‌తో జేసీబీ బ్యాక్‌హో లోడర్‌ని తెచ్చింది. 1963 : జేసీబీ 3సీ బ్యాక్‌హో పర్ఫార్మెన్స్‌ని పెంచారు. 1964 : జేసీబీ7 అనే మొదటి క్రాలర్ ఎక్స్‌కవేటర్‌ని మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. 1971 : జేసీబీ 110 హైడ్రోస్టాటిక్ క్రాలర్ లోడర్ ఇన్నొవేషన్. 1977: జేసీబీ 520 టెలిస్కోపిక్ హ్యాండ్లర్. 1980: జేసీబీ3సీఎక్స్.. ఒకే వెహికల్‌తో రెండు రకాల పనులు చేసుకోవచ్చు.

1990: జేసీబీ ఫాస్ట్‌ట్రాక్ ప్రపంచంలోనే మొట్టమొదటి ఫుల్ సస్పెండెడ్, హై–స్పీడ్ డ్రాఫ్ట్ ట్రాక్టర్. 1993: జేసీబీ రోబోట్ స్కిడ్ స్టీర్ లోడర్.. ప్రపంచంలోనే అత్యంత సేఫ్టీ స్కిడ్ స్టీర్. 1997: జేసీబీ టెలిట్రక్. 2006: జేసీబీ 444 డీజిల్ ఇంజిన్లు. 2010: జేసీబీ ఎకో మెషిన్లు.. మెషిన్ కెపాసిటీని, ప్రొడక్షన్‌ని పెంచాయి.

### ఒకే ఏడాదిలో లక్ష

జేసీబీ1985లో 3సీఎక్స్ సైట్‌మాస్టర్ బ్యాక్‌హో లోడర్‌ని మార్కెట్‌లోకి తెచ్చింది. కంపెనీ తెచ్చిన బ్యాహోల్లో అత్యధికంగా అమ్ముడైంది ఇదే. అంతేకాదు.. ఒకే ఏడాదిలో లక్ష బ్యాక్‌హోలను ప్రొడ్యూస్ చేసింది కంపెనీ. ఆ సక్సెస్‌ని చూసిన బ్రిటన్ మొదటి మహిళా ప్రధాన మంత్రి మార్గరెట్ థాచర్ 1987లో జేసీబీ కంపెనీకి వెళ్లింది కూడా.

ఎక్స్‌కవేటర్లు%–% ఇవి నిర్మాణ రంగంలో, పొలాల్లో రకరకాల పనులు చేస్తుండటం చూసే ఉంటారు. కానీ వాటిని ఎక్స్‌కవేటర్లు అంటారనే విషయం చాలామందికి తెలియదు. వీటిని 'జేసీబీ' అనే పిలుస్తుంటారు. వాస్తవానికి జేసీబీ అంటే ఎక్స్‌కవేటర్లు తయారుచేసే కంపెనీ పేరు. అదే ఆ కంపెనీ యజమాని పేరు కూడా.

ఒక పొలంలో చిన్న గ్యారేజీలో మొదలైన జేసీబీ చెక్కర్లు కొడుతూ.. 150 దేశాలకు ట్రావెల్ చేసింది.

# పురుషుల్లో సంతాన భాగ్యానికి అవరోధాలు ఇవి..!

## జీవనశైలి, ఆహార అలవాట్ల ప్రభావం కీలకం

## రోజువారీ వ్యాయామం చేయడం వల్ల మంచి ఫలితం

## ఒత్తిడి, అధిక, తక్కువ బరువు లేకుండా చూసుకోవాలి



కొత్తగా పెళ్లయిన వారు, పిల్లల కోసం ప్లాన్ చేసుకుంటున్న వారు తమ లైంగిక ఆరోగ్యం గురించి ముందుగా సమగ్రంగా తెలుసుకోవడం మంచిది. గతంతో పోలిస్తే సంతాన సాఫల్యత సామర్థ్యం గణనీయంగా తగ్గుతూ వస్తోంది. కొందరికి పెళ్లయిన వెంటనే సంతానం కలుగుతుంటే, కొందరు ఏళ్ల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. దీనికి ఎన్నో కారణాలు ఉండి ఉండొచ్చు. ముఖ్యంగా నేటి జీవనశైలి, ఆహారం అలవాట్లు ప్రధాన కారణంగా ఉంటున్నాయి. పురుషుల్లో సంతాన భాగ్యానికి అడ్డు పడుతున్న అంశాల గురించి ఇక్కడ చూద్దాం.

### ఆరోగ్యకరమైన జీవనశైలి

పురుషుల్లో వీర్యకణాలు ఆరోగ్యంగా, చురుగ్గా ఉన్నప్పుడే సంతాన సాఫల్యత అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. వీర్యం నాణ్యతపై జీవనశైలి ప్రభావం ఉంటుంది. అందుకని పోషకాహారం, సమతులాహారం, తగినంత నీరు తీసుకోవాలి. మద్యపానం, పొగతాగడం, ఇతర చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి.

**ఒత్తిడి:** తీవ్ర ఒత్తిడి కూడా సంతానానికి అడ్డుగోడగా వ్యవహరిస్తుంది. హార్మోన్ల ఉత్పత్తి, వీర్య ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. వ్యాయామం, మెడిటేషన్, యోగా ద్వారా ఒత్తిడిని తొలగించుకోవచ్చు. మనసుకు ఉల్లాసాన్నిచ్చే వ్యాపకాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

### బరువు

శరీర బరువు కూడా కీలక పాత్ర పోషిస్తుంది. అధిక బరువు, అదే సమయంలో తక్కువ బరువు ఉండకూడదు. ఈ విషయంలో న్యూట్రిషనిస్ట్ సలహా తీసుకోవడం మంచిది.

### కాలుష్యం

పర్యావరణ కాలుష్య ప్రభావం కూడా సంతాన సాఫల్యతపై ఉంటుంది. అధిక వేడికి ఎక్కువ సమయం పాటు గురికాకుండా చూసుకోవాలి. పురుగు మందులు, మెటల్స్ ప్రభావం పడకుండా జాగ్రత్త పడాలి. గాలి కాలుష్యం ప్రభావం తగ్గించుకునేందుకు అధిక రక్షణనిచ్చే ఫేస్ మాస్క్ వాడాలి.


**వ్యాయామాలు:** క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయడం వల్ల జీవక్రియలు మెరుగ్గా ఉంటాయి. లైంగిక సామర్థ్యం కూడా పెరుగుతుంది. శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళ్లిపోవడమే కాకుండా, వ్యాధి నిరోధక శక్తి బలపడుతుంది. ఇది కూడా సంతాన సాఫల్యతను మెరుగుపరుస్తుంది. దీనికితోడు వైద్యుల దగ్గరకు వెళ్లి ఏవైనా అవరోధాలు ఉన్నాయేమో నిర్ధారించుకోవాలి.

# మధ్యాహ్నం తిన్న వెంటనే నిద్ర వస్తోందా..? ఇలా చేస్తే చాలు!

## ఈ సమస్యను నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు

## తీసుకునే ఆహారంలో మార్పులు చేసుకోవాలి

## హెవీగా తినకుండా, పీచుకు ప్రాధాన్యం ఇవ్వాలి



ఉదయం టిఫిన్ చేసిన తర్వాత ఉద్యోగ, వృత్తి, వ్యాపార జీవితం మొదలవుతుంది. మధ్యాహ్నం 12 గంటలు దాటిన తర్వాత నుంచి కడుపులో ఆకలి అనిపిస్తుంటుంది. దీంతో లంచ్ చేసే సమయం కోసం మనసు ఎదురు చూస్తుంటుంది. తీరా లంచ్ సమయం రాగానే కడుపునిండా తినేస్తాం. ఇక ఆ తర్వాత నుంచి నిద్ర పాట్లు మొదలవుతుంటాయి. కళ్లు మూతలు పడుతుంటాయి. సాధారణంగా ఎక్కువ మందికి ఇలాంటి అనుభవమే ఎదురవుతుంటుంది. అలా కొంత సమయం పాటు నిద్ర వేధిస్తుంటుంది.

తిన్న తర్వాత తిరిగి ఉత్సాహంగా పనిచేసుకునేట్టు ఉండాలి కానీ, ఈ నిద్ర గొడవ ఏంటిరా బాబూ? అని బాధపడే వారుంటారు. తిన్న తర్వాత నిద్ర వస్తుంటే దీన్ని పోస్ట్ ప్రాండియల్ సోమ్నోలెన్స్ అంటారు. అంటే ఫుడ్ కోమాగా దీన్ని చెబుతారు. ఎందుకని ఇది వస్తుంటుంది? దీనికి కారణాన్ని పరిశీలిస్తే శరీరం తిన్న తర్వాత మరింత సెరటోనిన్ ను ఉత్పత్తి చేస్తున్నట్టు పరిశోధనల్లో తేలింది. సెరటోనిన్ అనేది న్యూరోట్రాన్స్ మీటర్. నిద్ర, మూడ్ ను ఇది ప్రభావితం చేస్తుంటుంది. తిన్న తర్వాత ఇలా నిద్ర రావడం అన్నది అనారోగ్యం ఏమీ కాదు. కాకపోతే తిన్న తర్వాత పని చేయాల్సి ఉంటే పెద్ద అడ్డంకిగా మారుతుంది. దీన్ని అధిగమించేందుకు కొన్ని మార్గాలు ఉన్నాయి.

### పరిమాణం

లంచ్ లో భాగంగా తీసుకునే ఆహార పరిమాణంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. ముఖ్యంగా హెవీగా (అధికంగా) తినకూడదు. సరిపడానే తినాలి. కొంత వెలితిగా తింటే మరీ మంచిది. పనిచేస్తూ అస్సలే తినొద్దు. దీనివల్ల ఎంత తింటున్నామన్నది పట్టింపు ఉండదు. ఉదయం బ్రేక్ ఫాస్ట్ ను మిస్ చేసుకోవద్దు. ఉదయం ఏమీ తినకపోయినా, మధ్యాహ్నం ఎక్కువగా తినాల్సి వస్తుంది. దాంతో నిద్ర ముంచెత్తుతుంది.

### మెనూ

ఆహారంలో భాగంగా ఏమి తింటున్నామనేది కూడా ముఖ్యమే. ప్రొటీన్, కార్బోహైడ్రేట్స్ తో పోలిస్తే ఫ్యాట్ ఎక్కువగా ఉంటే దాన్ని జీర్ణం చేసుకోవడానికి శ్రమ పడాల్సి వస్తుంది. కనుక లంచ్ లో భాగంగా అధిక కొవ్వుతో ఉండే వాటికి దూరంగా ఉండాలి. ఇక అధిక కార్బోహైడ్రేట్స్ ఉన్న ఆహారంతోనూ ఇదే సమస్య ఎదురవుతుంది. కనుక పీచుతో కూడిన సమతులాహారం, పండ్లు, కూరగాయలతో కలిపి తీసుకోవాలి.

ముడి ధాన్యాలు మంచివి. పీచుతో ఉన్న వాటి వల్ల తిన్న వెంటనే రక్తంలోకి గ్లూకోజ్ ఒకేసారి విడుదల కాదు. లంచ్ లో భాగంగా షుగర్ తో కూడిన డ్రింక్స్ ను తాగొద్దు. వాటివల్ల కూడా రక్తంలో గ్లూకోజ్ పెరిగిపోతుంది. లంచ్ కు ముందు ఆల్కహాల్ ను సైతం తీసుకోవద్దన్నది నిపుణుల సూచన. లంచ్ ను ఎప్పుడూ బయట తినడం కాకుండా, ఇంటి ఆహారాన్నే తీసుకోవాలి.

### రాత్రి నిద్ర

ఇక రాత్రి మంచి నిద్రపోయేలా జీవన చర్యల్లో మార్పు చేసుకుంటే, అప్పుడు కూడా మధ్యాహ్నం తిన్న తర్వాత నిద్ర వచ్చే సమస్య కనిపించదు. రాత్రి నిద్ర మంచిగా పోవడం వల్ల హార్మోన్ల విడుదల చక్కగా ఉంటుంది. జీవక్రియలు చురుగ్గా మారతాయి. దాంతో మధ్యాహ్నం నిద్ర సమస్య ఉండదు. నిద్ర లేమి వల్ల శరీరంలో గ్రెలిన్ పెరిగిపోతుంది. ఈ హార్మోన్ మెదడుకి బాగా ఆకలితో ఉన్నట్టు సంకేతాలు పంపిస్తుంది.

### మధుమేహం ఉన్నా అంతే..

ఇక తిన్న వెంటనే నిద్ర కుమ్మేస్తుంటే, ఆహారంలో మార్పులు చేసుకున్న తర్వాత కూడా ఇందులో మార్పు లేకపోతే.. అప్పుడు మధుమేహం ఉందేమో ఓసారి పరీక్షలు చేయించుకోవాలి.

## మౌని రాయ్ చీరకు గ్లామర్ జోడించింది



# భర్తను 'మేనికార్న్' అంది.. అలా అనొచ్చా అదితీ?



అదితి రావ్ హైదరీ - సిద్ధార్థ్ జంట ప్రేమాయణం, పెళ్లి వ్యవహారం తెలిసినవే. తెలంగాణలోని 400 ఏళ్ల నాటి గుడిలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సన్నిహితులు సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. సినీసెలబ్రిటీలు సహా అభిమానులు ఈ జంటను ఆశీర్వదించారు. మహాసముద్రం సెట్స్‌లో కలుసుకున్న తర్వాత ప్రేమలో పడిన ఈ జంట, కొన్నేళ్ల పాటు డేటింగ్ లో ఉంది. ఎట్టకేలకు పెళ్లితో ఒకటైంది. ఆ ఇద్దరి మధ్యా రొమాన్స్ ఒక రేంజులో వర్కవుటవుతోంది. వారు ఒకరిని మించి ఒకరు చిలిపి. ఇద్దరి మధ్యా సరసం ఒక రేంజులో కనెక్టవుతోంది. ఇప్పుడు అదితీ తన సఖుడిని %-%మేనికార్న్%-% అని కామెంట్ చేయడం చర్చగా మారింది. అదితీ తన భర్తను ఆ పేరుతో ఎందుకు పిలుస్తుందో తెలుసా? అయితే ఈ ముద్దుపేరు %-%మేనికార్న్%-% ఎలా పుట్టిందో కారణం వెతికితే.. గలాట్టా ఇండియాతో త్రోబాక్ ఇంటర్వ్యూలో అదితీ అసలు విషయం చెప్పింది.

తనూజా డబీర్ నన్ను %-%యునికార్న్%-% అని పిలుస్తుంది. కాబట్టి ఆమె జూనికార్న్ అని చెప్పింది. ఆమె సిద్ధు (సిద్ధార్థ్)ని కలిసినప్పుడు %-%ఓహ్ మై గాడ్ యునికార్న్%-% మీరు మీ %-%మేనికార్న్%-%ని కనుగొన్నారు అని అంది. అందుకే అతడిని అలా పిలుస్తాను%--% అని అదితీ అసలు కథ చెప్పింది. అదితి రావ్ హైదరి తన భర్త సిద్ధార్థ్‌కు ఇదివరకూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపినప్పుడు మొదటిసారిగా మానికార్న్ అని వ్యాఖ్యానించింది. %--%హ్యాపీయెస్ట్ బర్త్ డే నా మేనికార్న్, అంతులేని నవ్వు.. అద్భుత ఆనందానికి, శక్తికి నిర్వచనం.. అంటూ రాసింది. అదితి తాను సిద్ధార్థ్ కి %-%ఎప్పటికీ ఛీర్‌లీడర్%-% అని కూడా అంది.

## కంగనా శర్మ: చిక్ ట్రైల్‌బ్లేజర్



# పిక్ టాక్ : జిమ్ ఔట్‌ఫిట్ లో శర్మ సిస్టర్స్ అదుర్స్



రామ్ చరణ్ హీరోగా పరిచయం అయిన చిరుత సినిమాతో నేహా శర్మ హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన విషయం తెల్సిందే. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు నేహా శర్మకి మంచి పేరు వచ్చింది. అయితే లక్ కలిసి రాక పోవడంతో వరుసగా నిరాశ పరుస్తూ ఫెయిల్ అయింది. ఈమె నటించిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద పెద్దగా ఆడలేదు. పైగా చిన్న సినిమాలు, ప్రాముఖ్యత లేని పాత్రలను ఎంపిక చేసుకోవడం వల్ల తక్కువ సమయంలోనే టాలీవుడ్ నుంచి ఈ అమ్మడు తప్పుకోవాల్సి వచ్చింది అనేది ఇండస్ట్రీ వర్గాల అభిప్రాయం. టాలీవుడ్ కి దూరం అయినా బాలీవుడ్ లో కంటిన్యూ అవుతోంది. బాలీవుడ్ లో అడపా దడపా ఆఫర్లు సొంతం చేసుకుంటూ ఇంకా తాను నటిస్తున్నాను అనే విధంగా సినిమాలు చేస్తున్న నేహా శర్మ సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటుంది. ఈ మధ్య కాలంలో ఆమె షేర్ చేసిన ప్రతి ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడం మనం చూస్తూ ఉన్నాం. ఇటీవల నేహా శర్మ సిస్టర్ ఐషా శర్మ సైతం సోషల్ మీడియాలో అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా చూపు తిప్పుకోనివ్వడం లేదు.

సాధారణంగా ఇద్దరూ వేరు వేరు ఫోటోలను షేర్ చేస్తేనే ప్రేక్షకులు చూపు తిప్పుకోలేరు. అలాంటిది ఇద్దరూ కలిసి కనిపిస్తే ఇంకా ఏమైనా ఉందా.. అన్నట్లుగా తాజా ఫోటో ఉంది. %ూశ్రీంశీ =ఝ%ం% - 2024ఏటాలీవుడ్.. ఈ పాయింట్ ను గమనించారా? నేహా సిస్టర్స్ ఫిట్ గా ఉండటం కోసం రెగ్యులర్ గా జిమ్ కు వెళ్తారు. కేవలం వీరు మాత్రమే కాకుండా హీరోయిన్స్ లో దాదాపు అందరూ ఫిట్నెస్ కోసం రెగ్యులర్ గా జిమ్ చేస్తారు. అలా చేయడం వల్లే వారి అందం రోజు రోజుకు మరింత పెరిగిందా అన్నట్లుగా అందంగా కనిపిస్తారు. ఇప్పుడు నేహా శర్మ సైతం మొదటి సినిమాతో పోల్చితే ఇప్పుడే చాలా అందంగా ఉంది అంటూ ఆమె సన్నిహితులు, నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. అక్కకు ఏమాత్రం తగ్గకుండా ఐషా శర్మ సైతం చాలా సన్నగా, నాజూకుగా అందంగా కనిపిస్తూ ఉంటుంది. ముందు ముందు హీరోయిన్ గా మంచి ఆఫర్లు దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి. %ూశ్రీంశీ =ఝ%ం% - షూటింగ్ సగంలో మూవీ చేయను అంటూ మొండికి వేసిన తారక్.. అసలు రీసన్ ఇదే.. ఇప్పటి వరకు సినిమాల్లో అందాల ఆరబోత చేయని ఐషా శర్మ ఇలా అక్కతో కలిసి అప్పుడప్పుడు, సోలోగా అప్పుడప్పుడు ఫోటోలను షేర్ చేసి నెటిజన్స్ చూపు తిప్పుకోకుండా చేస్తుంది. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈ ఇద్దరు ముద్దుగుమ్మల సొంతం అవ్వడంతో ముందు ముందు మళ్లీ వీరిద్దరు సినిమాల్లో బిజీ అవ్వాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. జిమ్ డ్రెస్ లో వీరిద్దరినీ చూస్తూ ఉంటే మతి పోతుందని, ఒకేసారి ఇద్దరి అందం చూడ్డానికి రెండు కళ్లు చాలడం లేదు అన్నట్లుగా కొందరు కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి మరోసారి ఈ సిస్టర్స్ వైరల్ అవుతున్నారు.